
ఈనాడు
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు
గురువారం అక్టోబరు 3, 2024



శరన్నవరాత్రి శోభ

విద్యుద్దీప కాంతుల్లో దర్గామిట్ట రాజరాజేశ్వరి ఆలయం

ఆలయాలు విద్యుద్దీప కాంతుల్లో మిరుమిట్లు గొలుపుతుండగా- జిల్లా వ్యాప్తంగా శరన్నవ రాత్రి శోభ సంతరించుకుంది. దర్గామిట్టలోని రాజరాజేశ్వరిదేవి, జొన్నవాడ కామాక్షితాయి, మూలపేటలోని ఇరుకళల పరమేశ్వరీ, మూల స్థానేశ్వరస్వామి ఆలయంలోని భువనేశ్వరీదేవి ఆలయాల్లో ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేశారు. కలశ స్థాపనతో నేడు ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి.
– న్యూస్‌టుడే, నెల్లూరు(సాంస్కృతికం)



నెల్లూరు స్టోన్‌హౌస్‌పేటలోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయం

రైలు దారిపై దృష్టి



రైలు మార్గాలను పటిష్టపరిచే చర్యలు వేగంగా సాగుతున్నాయి. ఆధునిక యంత్రాలతో అవసరమైన చోట్ల మరమ్మతులు చేస్తున్నారు. ఎగువ మార్గంలో భారీ లగేజీతో గూడ్స్, ఎక్స్‌ప్రెస్ రైళ్ల ప్రభావంతో ట్రాక్ దెబ్బతినే అవకాశం ఉంది. అదే జరిగితే.. రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతాయి. ఆ పరిస్థితిని నివారించేందుకు ఈ పనులు చేపట్టారు. బుధవారం బిట్రగుంట స్టేషన్ పరిధిలో కార్మికులు పట్టాల మధ్య గేజ్ తేడాను సరిచేస్తూ.. రైళ్ల పరుగుకు అంతరాయం లేకుండా చేశారు. – న్యూస్‌టుడే, బిట్రగుంట

పరిసరాల పరిశుభ్రతే... మహాత్మునికి అసలైన నివాళి



పల్లిపాడు పినాకినీ ఆశ్రమంలో గాంధీజీకి నివాళులర్పిస్తున్న కలెక్టర్ ఆనంద్ తదితరులు



స్వచ్ఛతా హీ సేవా ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు

నెల్లూరు(కలెక్టరేట్), ఇందుకూరుపేట, న్యూస్‌టుడే: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడమే మహాత్మునికి అసలైన నివాళి అని కలెక్టర్ ఆనంద్ ఉద్బోధించారు. నెల్లూరులోని కస్తూర్బా కళాక్షేత్రంలో బుధవారం గాంధీజీ జయంతిని, స్వచ్ఛభారత్ దివస్ సందర్భంగా స్వచ్ఛతా హీ సేవా ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, జేసీ కార్తీక్, నగరపాలక సంస్థ కమిషనర్ సూర్యతేజ, అధికారులతో కలిసి జ్యోతి వెలిగించి.. బాపూజీ చిత్రపటానికి పూలమాల వేశారు. అనంతరం ఆహూతులతో స్వచ్ఛతా హీ సేవా ప్రతిజ్ఞ చేయించారు. జేసీ కార్తీక్, కమిషనర్ సూర్యతేజ మాట్లాడుతూ.. పరిశుభ్రత ప్రాధాన్యాన్ని అందరూ గుర్తించాలన్నారు. స్వచ్ఛత హి సేవాలో విశేష సేవలందించిన ఎంపీడీవోలు శ్రీధర్, నగేష్‌కుమారి, విజయ, ఈవో పీఆర్డీలు వీరేంద్ర, మహేశ్వరి, గోపి, శ్రీనివాస్‌లను జ్ఞాపికలతో సత్కరించారు. నగర పాలక సంస్థ ఇంజినీరింగ్, ఆరోగ్య విభాగాల అధికారులను సన్మానించారు. పంచాయతీల్లో ఉత్తమ సేవ లందించిన పారిశుద్ధ్య కార్మికులు, భూగర్భ డ్రైనేజీ కార్మికులను శ్రమదాన్ పురస్కారాలతో సత్కరించారు. వివిధ పాఠశాలల విద్యార్థుల సాంస్కృతి కార్యక్రమాలు అలరించాయి. డీపీవో సుస్మిత, జడ్పీ సీఈవో ఖాదర్‌బాషా, సర్వశిక్షా అభియాన్ ఏపీవో ఉషారాణి, డ్వామా, ఐసీడీఎస్ పీడీలు గంగాభవాని, హేనా సుజన్ తదితరులు పాల్గొన్నారు.



ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

పినాకినీ ఆశ్రమాన్ని.. పర్యాటకంగా తీర్చిదిద్దుతాం

దక్షిణ సబర్మతిగా పేరొందిన పినాకినీ సత్యాగ్రహ గాంధీ ఆశ్రమాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని కలెక్టర్ ఆనంద్ అన్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని బుధవారం ఆయన ఆశ్రమాన్ని సందర్శించారు. అక్కడి బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు ఆశ్రమం చరిత్ర తెలుసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. రెడ్‌క్రాస్ వైస్ ఛైర్మన్ సురేష్‌నాయుడు, కోశాధికారి సురేష్ జైన్, సభ్యులు గునపాటి ప్రసాద్‌రెడ్డి, రవి ప్రకాష్, రాజేంద్రప్రసాద్, సుకుమార్‌రెడ్డి, శ్రీహరి రెడ్డి, రంగయ్య, ప్రసన్నాంజనేయులు పాల్గొన్నారు.


సైబర్ నేరగాళ్ల వల

చేజర్ల తహసీల్దారు నుంచి రూ. 3.50 లక్షలు కాజేత



చేజర్ల : సైబర్ నేరగాళ్లు ఉద్యోగులను లక్ష్యంగా చేసుకున్నారు. గత ప్రభుత్వంలో జరిగిన భూ అక్రమాలు, అక్రమార్జనను అలుసుగా తీసుకుని.. పలువురు అధికారులు, ఉద్యోగులను బెదిరించి, వేధించి రూ. లక్షలు వసూలు చేశారు. తాము అవినీతి నిరోధకశాఖకు చెందిన వారమని, మీ అక్రమాస్తులు, దస్త్రాల్లో అవకతవకలకు పాల్పడిన చిట్టా తమ వద్ద ఉందని ఫోన్ల ద్వారా బెదిరించారు. ఆయా వ్యవహారాలు వెలుగులోకి తేకుండా ఉండాలంటే.. తాము అడిగినంత ముట్టజెప్పాలని డిమాండ్ చేశారు. అప్రమత్తమైన కొందరు.. ఆ బెదిరింపులు, డిమాండ్లకు తలొగ్గకుండా జాగ్రత్తపడితే.. మరికొందరు భయంతో కొంత సొమ్ము ముట్టచెప్పి మోసపోయారు. కొద్దిరోజుల కిందట చేజర్ల తహసీల్దారు ఎ.వెంకటరమణారావును రూ. అయిదు లక్షలు డిమాండ్ చేశారు. వివిధ మార్గాల్లో రూ. 3.60 లక్షలు వసూలు చేశారు. అనంతరం ఆయన తనకు ఎదురైన అనుభవాన్ని సహచర అధికారులు, సిబ్బందితో చర్చించే క్రమంలో సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయినట్లు గుర్తించారు. సంగం సీఐ కార్యాలయంలో ఫిర్యాదు చేయగా- పోలీసు అధికారులు కేసు నమోదు చేసి.. వివరాలు సేకరించే పనిలో పడ్డారు. గతంలో ఆత్మకూరు రెవెన్యూ డివిజన్‌లోపనిచేసిన ఓ అధికారిణి సైతం ఇలాంటి మోసానికే గురయ్యారు. తాజా సంఘటన జిల్లాలో తీవ్ర చర్చనీయాంశమైంది.

చెత్త పన్నుకు చెల్లుచీటీ!



ఈనాడు, నెల్లూరు: కార్పొరేషన్, న్యూస్‌టుడే: నగర, పట్టణాల్లో గత ప్రభుత్వం విధించిన 'చెత్త పన్ను'ను కూటమి ప్రభుత్వం రద్దు చేసింది. తద్వారా ప్రజలకు ఊరట లభించింది. వైకాపా ప్రభుత్వం 2021లో ప్రారంభించిన ఈ విధానంపై ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. అధికారులు, సిబ్బంది బెదిరింపులు, చెత్తను తీసుకొచ్చి దుకాణాల ముందు పారబోయడం వంటికి చేసినా.. జనాలు వెనక్కు తగ్గలేదు. దాంతో కొన్ని ప్రాంతాల్లో బలవంతపు వసూళ్లకు దిగారు. ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు.. బుధవారం చెత్తపన్నును రద్దు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించారు. దీంతో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో ప్రతి ఇంటి నుంచి రూ. 90, రూ. 60 చొప్పున ప్రాంతాల వారీగా పన్ను విధించారు. ఇక్కడ మొత్తంగా 1.33 లక్షల అసెస్‌మెంట్లు ఉండగా- రూ. 1.18 కోట్ల మేర చెత్త పన్ను వసూలు లక్ష్యంగా నిర్ణయించారు. వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది ద్వారా దీన్ని ముక్కుపిండి వసూలు చేశారు. వైకాపా ప్రభుత్వంలో నెల్లూరుతో పాటు కావలి, కందుకూరు, బుచ్చిరెడ్డిపాళెం, ఆత్మకూరు, అల్లూరు పుర, నగర పంచాయతీల్లో మొత్తంగా సుమారు రూ. 30 కోట్ల మేర వసూలు చేసినట్లు సమాచారం. ఎన్నికల సమయంలో కొన్ని ప్రాంతాల్లో పన్ను వడ్డింపు తగ్గించినా.. ప్రజల్లో వ్యతిరేకత మాత్రం తగ్గలేదు.

'క్లాప్'తో అ'ధనం'

నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో 54 డివిజన్లు ఉండగా- ప్రతి నెలా చెత్త పన్ను వసూళ్ల బాధ్యతను సచివాలయాలకు అప్పగించారు. లక్ష్యాలు పూర్తి చేయని వారిపై చర్యలు చేపట్టారు. 'క్లాప్' కార్యక్రమం కింద నెల్లూరుకు 125 వాహనాలు కేటాయించగా.. 95 వచ్చాయి. వీటికి ప్రతి నెలా రూ. 62 లక్షలు చెల్లించాలి. నగరపాలక సంస్థ వసూలు చేసిన చెత్త పన్నును పురపాలక కమిషనరేట్ తీసుకుంటుంది. అక్కడి నుంచి నిర్వహణ సంస్థకు చెల్లింపులు చేస్తున్నారు. వాస్తవానికి నగరపాలక సంస్థ ద్వారానే చెల్లింపులు చేయాల్సి ఉండగా.. అవేమీ పట్టించుకోకుండా పన్ను మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం మళ్లించుకుంది. దీంతో వాహనాల నిర్వహణ కొరవడి.. సగానికిపైగా మూలకు చేరాయి. ఉన్నవాటికీ.. సాధారణ నిధుల నుంచి కేటాయించాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రస్తుత ప్రభుత్వ నిర్ణయంతో జిల్లాలోని అన్ని నగర, పురపాలక సంస్థల్లో నెలకు రూ. 1.56 కోట్ల మేర చెత్త పన్ను భారం ప్రజలపై తగ్గనుంది.

బిగుస్తున్న ఉచ్చు!

లేఅవుట్ల వారీగా విజిలెన్స్ బృందం పరిశీలన
కావలి, సర్వేపల్లి, నెల్లూరుల్లో భారీగా అవకతవకల గుర్తింపు



ఈనాడు, నెల్లూరు

'నవ రత్నాలు- పేదలందరికీ ఇళ్లు' పథకం పేరిట వైకాపా ప్రభుత్వంలో జరిగిన మోసాల గుట్టు వీడుతోంది. కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిన విజిలెన్స్ విచారణలో విస్తుబోయే విషయాలు వెలుగు చూస్తున్నాయి. ప్రధానంగా నాసిరకం నిర్మాణాలు.. లబ్ధిదారులతో చేసుకున్న ఒప్పందాల ప్రకారం ఇళ్లు నిర్మించకపోవడం.. ఆన్‌లైన్‌లో నమోదు చేసిన వివరాలకు పొంతన లేకపోవడాన్ని గుర్తించినట్లు తెలుస్తోంది. సిమెంట్, స్టీలు, ఇసుక కేటాయింపులో భారీగా అవకతవకలకు పాల్పడినట్లు తేల్చారు. కావలి, సర్వేపల్లి నియోజకవర్గాల్లో పెద్దఎత్తున దోపిడీ జరిగినట్లు నిర్ధారించారు. వాటిలో గుత్తేదారులు, అధికారుల పాత్ర ఉన్నట్లు తేల్చిన విజిలెన్స్ బృందం.. అక్రమార్కులపై చర్యల దిశగా ఉచ్చు బిగిస్తున్నట్లు సమాచారం. ప్రధానంగా ఆప్షన్-3లో జరిగిన ఇళ్ల నిర్మాణాలు, వాటి నాణ్యత, బిల్లుల చెల్లింపు తదితర అంశాలను క్షుణ్నంగా పరిశీలిస్తోంది.

స్టీలు, సిమెంట్ ఏమైంది!

జిల్లాలో మొత్తం 85,344 ఇళ్లు మంజూరు చేయగా.. వీటిలో 29,238 ఇళ్ల నిర్మాణ బాధ్యతను ఆప్షన్-3లో భాగంగా 180 మంది గుత్తేదారులకు అప్పగించారు. వారు ఈ ఏడాది జూన్ వరకు 5,954 మాత్రమే పూర్తి చేశారు. 1024 ఇళ్లను అసలు ప్రారంభించనే లేదు. మిగిలినవి వివిధ స్థాయిలో ఉన్నాయి. దీనికి గాను గుత్తేదారులకు రూ. 340 కోట్ల విలువైన సామగ్రి, నగదు అందజేశారు. విజిలెన్స్ అధికారులు ఇలాంటి వాటిపై దృష్టిపెట్టగా, తాజా పరిణామాల నేపథ్యంలో బాధ్యులైన గృహ నిర్మాణశాఖ అధికారులతో పాటు నెల్లూరు నగరపాలక, కావలి సచివాలయ ఎమినిటీస్ సెక్రటరీలు, కొందరు సచివాలయ సెక్రటరీలు వణికిపోతున్నారు. ఎందుకంటే, బిల్లులకు సంయుక్తంగా సిఫార్సు చేసింది వీరేనని.. విజిలెన్స్ అధికారులు నిర్ధారించారు. బాధ్యులైన వారిలో గృహ నిర్మాణ ఏఈ, డీఈ, ఇతర అధికారులు ఉన్నట్లు సమాచారం.


వారే కీలకం...

జిల్లాకు చెందిన ఓ గుత్తేదారు రాష్ట్రంలోనే అత్యధిక ఇళ్ల నిర్మాణ బాధ్యత తీసుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 77,282 ఇళ్ల నిర్మాణ బాధ్యత తీసుకోగా.. జిల్లాలో సుమారు 7,769 కట్టిస్తామని లబ్ధిదారులతో ఒప్పందం చేసుకున్నారు. వాటిలో ఇప్పటి వరకు 1,220 పూర్తి చేయగా.. 4,337 వరకు స్లాబ్ దశలో ఉన్నాయి. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి. ఈయన పూర్తి చేసినట్లు చెబుతున్న ఇళ్లలో ఒక్కరూ నివాసం ఉండటం లేదు. పైపైన పూతలు వేసి.. కనీసం ఇంటి లోపల ప్లాస్టరింగ్, ఫ్లోరింగ్ చేయకుండానే పూర్తి బిల్లులు కాజేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఇందులో గృహ నిర్మాణశాఖలో పనిచేసే అవుట్ సోర్సింగ్ ఉద్యోగి ఒకరు కీలక పాత్ర పోషించారు. గుత్తేదారుకు కొమ్ముకాస్తూ పలువురు గృహ నిర్మాణ శాఖ అధికారుల లాగిన్ ఐడీలను తన వద్ద ఉంచుకుని.. ఇష్టానుసారం ఫొటోలు అప్‌లోడ్ చేయడంతో పాటు బిల్లుల చెల్లింపులు జరిగేలా వ్యవహరించారని ఎన్నికల ముందు కూటమి నాయకులు తీవ్ర ఆరోపణలు చేశారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గంలో వైకాపా విజయానికి భారీగానే ఖర్చు చేశారనే విమర్శలు ఉన్నాయి. ప్రస్తుతం అదే గుత్తేదారుడికి ఇళ్ల నిర్మాణ బాధ్యతలు ఇవ్వడం.. సదరు అవుట్ సోర్సింగ్ సిబ్బంది రెండుచోట్లా పనులు చేస్తుండటంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

> వైకాపా ప్రభుత్వం.. ఆప్షన్-3 పేరుతో ఆ పార్టీ నాయకులు దోచుకునేందుకు అవకాశం కల్పించింది. ప్రభుత్వం ఇచ్చే రూ. 1.80 లక్షలకు ఇంటి నిర్మాణం చేపట్టలేమని తెలిసినా.. కాలనీల్లో కట్టేందుకు పోటీపడ్డారు. నిర్మాణాల్లో నాణ్యతను విస్మరించడంతో పాటు.. అసలు ఇళ్ల నిర్మాణం ప్రారంభించకుండానే.. ఇసుము, సిమెంట్, నగదు తీసుకున్నారు. ఇప్పుడు విజిలెన్స్ అధికారులు లేఅవుట్లను గుర్తించడంతో పాటు.. నిర్మాణాలు సరిగా జరగని ప్రాంతాల్లో తనిఖీలు చేస్తున్నారు. అందులోనూ.. పునాదుల స్థాయిలో ఉన్నవాటిని ఎక్కువగా పరిగణనలోకి తీసుకున్నారు. దీంతో గత పాలకులు, అప్పటి పార్టీ నాయకుల అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి.

సాగునీటి సంఘాల ఎన్నికలకు కసరత్తు

ఓటర్ల జాబితా తయారీలో అధికారులు



రకం	ప్రాజెక్టు	డిస్ట్రిబ్యూటరీ కమిటీలు(డీసీ)	సాగునీటి సంఘాలు (డబ్ల్యూయూఏ)
మేజర్	సోమశిల	5	25
	పెన్నా డెల్టా	8	83
మధ్యతరహా	కనుపూరు కెనాల్	ఛైర్మన్	19

- పెద్దిరెడ్డిపల్లి, రాళ్లపాడు, స్వర్ణముఖి ఉండగా- వీటిల్లో స్వర్ణముఖి. . ప్రస్తుతం తిరుపతి జిల్లాలోకి వెళ్లింది. ఇక చిన్న, పెద్ద సాగునీటి ప్రాజెక్టులు, చెరువులు కలిపి 1200 వరకు ఉండగా- వంద ఎకరాల ఆయకట్టుకు మించి ఉన్న చెరువులకు సంఘాలను ఎంపిక చేస్తారు. మొత్తంగా వీటి కింద 5 లక్షలకుపైగా ఎకరాల ఆయకట్టు ఉంది.

న్యూస్‌టుడే, నెల్లూరు(వ్యవసాయం, సంగం)

క్షేత్ర స్థాయిలో పంట కాలువలు, చెరువులు.. నీటి సరఫరా పర్యవేక్షణ.. ఆయకట్టు పరిధిలో సమస్యల పరిష్కారంలో కీలకంగా వ్యవహరించే సాగునీటి సంఘాల ఎన్నికలకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. అవి నవంబరు మొదటివారంలో జరగనున్న నేపథ్యంలో.. జలవనరులశాఖ అధికారులు కసరత్తు ప్రారంభించారు. ప్రస్తుతం ఓటర్ల జాబితా తయారీలో నిమగ్నమయ్యారు.

వైకాపా ప్రభుత్వంలో రద్దు

2015లో నాటి తెదేపా ప్రభుత్వంలో ఎంపిక పద్ధతిలో సాగునీటి సంఘాల ఛైర్మన్లను నియమించారు. ఆ తర్వాత వచ్చిన వైకాపా ప్రభుత్వం.. సంఘాలను రద్దు చేసింది. ఆ నిర్ణయంతో సాగునీటి రంగానికి తీవ్ర నష్టం కలిగింది. ఖరీఫ్, రబీ సీజన్లకు ముందు కాలువల్లో తూడు, గుర్రపు డెక్క తొలగింపు పనులు సరిగా జరగలేదు. నిర్వహణపైనా పర్యవేక్షణ కొరవడింది. మరమ్మతులు విస్మరించిన కారణంగా.. నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

కొత్తగా ఏర్పాటు చేస్తే...

సోమశిల ప్రాజెక్టు, దక్షిణ కాలువ కింద పొదలకూరు మండలంలో 10వేల ఎకరాలు, ఏఎస్ పేట మండలం సోమశిల ఉత్తర కాలువ కింద శ్రీకొలను మేజర్ కెనాల్ కింద 15వేల ఎకరాల సాగు పెరిగినట్లు చెబుతున్నారు. ఇలా ఆయకట్టు పెరిగిన ప్రాంతాల్లో.. కొత్తగా సంఘాలను ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

ప్రభుత్వ నిర్ణయం ప్రయోజనకరం

సాగునీటి సంఘాలు ఉంటే రైతుల సమస్యలు సత్వరమే పరిష్కరించుకునే వెసులుబాటు ఉంటుంది. ప్రస్తుతం ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ నిర్ణయం శుభపరిణామం. – వై.గోవర్ధన్‌రెడ్డి, పెన్నాడెల్టా మాజీ ఛైర్మన్

రైతులకు ఎంతో మేలు

కాలువల్లో గుర్రపు డెక్క, పూడికతీతకు ఇబ్బందులు తలెత్తాయి. సంఘాలు లేకపోవడంతో రైతులకు సమాధానం చెప్పేవారు కరవయ్యారు. ప్రస్తుత నిర్ణయంతో సమస్యలు పరిష్కారమయ్యే వెసులుబాటు కలుగుతుంది.
– ఆర్.సుందరరామిరెడ్డి, సోమశిల ప్రాజెక్టు మాజీ ఛైర్మన్



పోటీ సరే.. ప్రమాదం మాటేమిటి!

ఈచిత్రం చూశారా! రెండు బస్సులు పక్కపక్కన వెళుతున్నాయి. ఇందులో ఏముందనుకునేరు. ఒకదానికొకటి పోటీ పడి వేగంగా వెళుతున్నాయి. ఇలా వెళ్లే వాహనాలు తరచూ ప్రమాదాలకు గురవుతున్నాయి. ఇవి సమాంతరంగా వేగంగా పక్కపక్కన ప్రయాణించే సమయంలో ఎదురుగా ఎటువంటి వాహనాలు రాలేదు. దీంతో ఏ ప్రమాదమూ చోటుచేసుకోలేదు. ప్రకాశం జిల్లా నుంచి జిల్లాలోకి ప్రవేశించే సమయంలో ముత్తోలినగర్ వద్ద బుధవారం ఈసంఘటన చోటుచేసుకుంది. – సీతారామపురం, న్యూస్‌టుడే

జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థినుల ఎంపిక

నెల్లూరు(విద్య) : వినుకొండలో జరిగిన రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో ప్రతిభ చూపిన నెల్లూరు సాయి మిలీనియం పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థిని ఎ.నిస్సీఅభిరూప జాతీయ పోటీలకు ఎంపికైందని కరస్పాండెంట్ అజిత, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి నాగేందర్‌రావు బుధవారం వివరించారు. ఈ నెల 18న జమ్మూకశ్మీర్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో ఈమె పాల్గొంటారన్నారు.



అనంతసాగరం : కచిరదేవరాయపల్లి గ్రామ రెవెన్యూ సహాయకులుగా పనిచేస్తున్న బండి రామయ్య కుమార్తె తనూజ కరాటే విభాగంలో రాణించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. ఆత్మకూరు చైతన్యటెక్నో పాఠశాల్లో ఏడో తరగతి చదువుతున్న బాలిక కడపజిల్లా రాజంపేటలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. త్వరలో దిల్లీలో జరగబోయే పోటీల్లో పాల్గొననుంది.


తనూజను ప్రశంసిస్తున్న అధ్యాపకులు

నిలిచిన నీరు.. వాహనదారుల బేజారు



ఎండ తీవ్రతతో ఇబ్బందులు పడుతున్న మండల ప్రజలకు బుధవారం సాయంత్రం కురిసిన భారీ వర్షం ఊరటనిచ్చింది. సుమారు గంట సేపు కురిసిన వర్షానికి రహదారులు బురదమయంగా మారాయి. గుడ్లూరు పంచాయతీ కార్యాలయం వద్ద సిమెంటు రోడ్డుపై మురుగు నిలవడంతో పాదచారులు, వాహనదారులు అవస్థలు పడ్డారు. - న్యూస్‌టుడే, గుడ్లూరు

అనుమతుల్లేని మట్టి తవ్వకాలపై చర్యలు

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే: అనుమతుల్లేకుండా మట్టి తవ్వకాలు చేస్తే చర్యలు తీసుకుంటామని సబ్‌కలెక్టర్ శ్రీపూజ అన్నారు. ఓగూరు రెవెన్యూ పరిధిలో పంట పొలాల మధ్యలో మట్టి తవ్వకాలు చేస్తున్న ప్రాంతాన్ని తహసీల్దారు సయ్యద్ ఇక్బాల్‌తో కలిసి బుధవారం పరిశీలించారు. సెప్టెంబర్ 30న 'అడిగే వారు లేరని.. అడ్డగోలు తవ్వకాలు' శీర్షికన 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. దీనిపై ఆమె స్పందించారు. భూ యజమానిని కార్యాలయానికి పిలిపించి మాట్లాడారు.

స్పందనం.. వందనం

ఉద్యాన రైతులకు ఉపాధి ఊతం

ఆత్మకూరు, న్యూస్‌టుడే: ఉద్యాన రైతులకు ఉపాధిహామీ పథకంతో పలు ప్రయోజనాలు చేకూరనున్నట్లు డ్వామా పీడీ గంగా భవాని అన్నారు. ఆత్మకూరు మండలం కరటంపాడులో బుధవారం నిర్వహించిన గ్రామసభలో పాల్గొన్నారు. మొదట మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఉపాధిహామీ పథకంలో భాగంగా పండ్ల, పూలతోటలు, పారం పాండ్స్, గట్టు వెంట చెట్ల పెంపకం, పొలాలకు మట్టితోలడం వంటి వ్యక్తిగత పనులు చేపడుతున్నామన్నారు. రైతులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలన్నారు. బొటికర్లపాడులో సర్పంచి నరసింహులు ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. సర్పంచి రేవతి, ఏపీవో శిరీష, తెదేపా రాష్ట్ర కార్యదర్శి దావా పెంచలరావు, ఈవోపీఆర్డీ ఉషారాణి, పంచాయతీ కార్యదర్శి నరసింహులు తదితరులు పాల్గొన్నారు.


మహాత్మాగాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డ్వామా పీడీ గంగాభవాని

అంగన్‌వాడీ కేంద్రాలకు మహర్దశ

సౌకర్యాలకు నిధులు మంజూరు


మరుగుదొడ్డి మంజూరైన ఇందుకూరుపేట మండలంలోని అంగన్‌వాడీ కేంద్రం

ప్రాజెక్టులు:	12
కేంద్రాలు:	2,934
చిన్నారులు:	1,24,628
గర్భిణులు:	13,204
బాలింతలు:	12,002

న్యూస్‌టుడే, దుత్తలూరు, ఉదయగిరి

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అంగన్‌వాడీ కేంద్రాల్లో సౌకర్యాల కల్పనపై దృష్టి పెట్టింది. చిన్నారుల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తోంది. దీంతో వీటికి మహర్దశ పట్టనుంది. జిల్లా వ్యాప్తంగా పక్కా భవనాలు ఉన్న చోట్ల మరుగుదొడ్లు, తాగునీటి కల్పన కోసం రూ. 2.6 కోట్లు మంజూరు చేసింది.

జిల్లాలోని 12 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 2,934 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటిల్లో చిన్నారులు 1,24,628 మంది ఉండగా గర్భిణులు, బాలింతలు 25 వేల మందికి పైగా ఉన్నారు. గత వైకాపా ప్రభుత్వం ఈ కేంద్రాలపై నిర్లక్ష్యం ప్రదర్శించింది. కనీస వసతుల కల్పనపై దృష్టి పెట్టిన పరిస్థితులు కూడా లేవు. పర్యవసానంగా చిన్నారులు, గర్భిణులు, బాలింతలు ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టగానే వీటి మెరుగుకు పూనుకుంది. తొలి విడతగా పక్కా భవనాలు ఉన్న కేంద్రాల్లో మరుగుదొడ్లు, తాగునీటి వసతి కల్పనకు చర్యలు చేపట్టింది. 993 రకాల పనుల కోసం రూ. 2.6 కోట్లు మంజూరు చేసింది. ఇందులో 486 కేంద్రాలకు మరుగుదొడ్లు, 507 కేంద్రాలకు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు చర్యలు మొదలయ్యాయి.

ఆర్‌డబ్ల్యూఎస్‌కు అప్పగింత

మరుగుదొడ్లు, తాగునీటి వసతి కల్పన పనుల ఏర్పాటు బాధ్యతలను జిల్లా గ్రామీణ నీటి సరఫరా శాఖ (ఆర్‌డబ్ల్యూఎస్)కు అప్పగించారు. ఒక్కో మరుగుదొడ్డికి రూ. 36 వేల వంతున 486 పనులకు రూ. 1.74 కోట్లు, తాగునీటి కల్పనకు ఒక్కో కేంద్రానికి రూ. 17 వేల వంతున 507 పనులకు రూ. 86.19 లక్షల మేర కేటాయించారు. వీలైనంత వేగంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

త్వరలో ప్రారంభిస్తాం

హేనాసుజన్, ఐసీడీఎస్ పీడీ

ప్రభుత్వం పక్కా భవనాలు ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగు నీరు, మరుగుదొడ్డి సౌకర్యాలు కల్పించేందుకు నిధులు కేటాయించింది. మంజూరైన కేంద్రాల్లో త్వరితగతిన పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.


మొక్కలు నాటుతున్న నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి

సమయాన్ని వృథా చేసుకోవద్దు: ఎంపీ

కేంద్ర కారాగారంలో గాంధీ జయంతి

నెల్లూరు(నేర విభాగం), న్యూస్‌టుడే: కారాగారంలో ఖైదీలు సమయాన్ని వృథా చేసుకోవద్దని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సూచించారు. బుజబుజనెల్లూరులోని కేంద్ర కారాగారంలో బుధవారం గాంధీ జయంతి, ఖైదీల సంక్షేమ దినోత్సవం నిర్వహించారు. తొలుత ఖైదీలు తయారుచేసిన ఫర్నిచర్‌ను పరిశీలించారు. అనంతరం చెట్లు నాటారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ గతంలో ఒక ఖైదీ తనకు చెక్కతో తయారుచేసిన అందమైన తాజ్‌మహల్ బహూకరించారనీ, అది ఇప్పటికీ తన ఇంట్లో భద్రంగా ఉందని గుర్తుచేశారు. ప్రధాని మోదీ పిలుపుమేరకు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా మరిన్ని మొక్కలు జైలులో నాటి బాధ్యతగా సంరక్షించాలని సూచించారు. కలెక్టర్ ఒ.ఆనంద్ మాట్లాడుతూ ఖైదీలు తమకు ఆసక్తి ఉన్న ఏదో ఒక వృత్తి నేర్చుకుంటే విడుదలైన తర్వాత స్వయంగా ఉపాధి పొందవచ్చన్నారు. జైలులో తాగునీటి సమస్య పరిష్కరిస్తామన్నారు. ఎస్పీ జి.కృష్ణకాంత్ మాట్లాడుతూ శిక్షాకాలం పూర్తయిన తర్వాత సమాజంలో తమ కుటుంబాలతో గౌరవప్రదమైన జీవితాన్ని గడిపేందుకు సత్ప్రవర్తనతో జీవించాలని సూచించారు. జైలులో ఓపెన్ స్కూల్ ద్వారా పదో తరగతి, ఇంటర్మీడియట్, అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా డిగ్రీలు పూర్తిచేసిన ఖైదీలకు సర్టిఫికెట్లు అందజేశారు. క్రీడలు, వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కారాగార సూపరింటెండెంట్ రాజారావు, అదనపు సూపరింటెండెంట్ మహేశ్‌బాబు, డీఎస్పీ సాయిప్రవీణ్, పలువురు జైలుశాఖ అధికారులు పాల్గొన్నారు.

సమాచార స్రవంతి

బంగారం ధరలు

గ్రాము ధర:	రూ. 7,316
(3 శాతం జీఎస్టీ కలిసిన ధర)	
సవర ధర:	రూ. 58,528
వెండి గ్రాము :	రూ. 96.20

వెంకాబ్ కోళ్ల ధరలు

బ్రాయిలర్ (రైతుధర)	111
రిటైల్	135
లేయర్	110
బ్రాయిలర్స్	196
బ్రాయిలర్స్ స్కిన్‌లెస్	223
లేయర్ మాంసం	187
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్	
బ్రాయిలర్	123
లేయర్	110
బ్రాయిలర్స్	222
బ్రాయిలర్స్ స్కిన్‌లెస్	248
లేయర్ మాంసం	187

నేటి నుంచి టెట్

నెల్లూరు(విద్య), న్యూస్‌టుడే: జిల్లాలో ఏర్పాటు చేసిన నాలుగు కేంద్రాల్లో గురువారం నుంచి టెట్ పరీక్ష నిర్వహిస్తామని డీఈవో పీవీజే రామారావు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 21వరకు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఒక సెషన్, రెండో సెషన్ మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ పరీక్ష జరుగుతుందన్నారు. 9350 మంది హాజరు కానున్నారని వివరించారు. ఇందుకుగానూ కావలిలో పీబీఆర్ విశ్వోదయ కళాశాల, రామిరెడ్డి సుబ్బరామిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల, నగరంలోని నారాయణ ఇంజినీరింగ్ కళాశాల, జొన్నవాడ రోడ్డులోని ఐయాన్ డిజిటల్ జోన్ సెంటర్‌లో ఆన్‌లైన్ విధానంలో పరీక్ష ఉంటుందన్నారు. అభ్యర్థులు ఆయా కేంద్రాలకు అరగంట ముందుగా చేరుకోవాలని సూచించారు. అడ్మిట్ కార్డుతోపాటు గుర్తింపుకార్డు తీసుకురావాలన్నారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములవుదాం

ముత్తుకూరు, న్యూస్‌టుడే: పరిశుభ్రతపై అవగాహన పెంచడంలో స్వచ్ఛ భారత్ ఉద్యమం కీలకమని, పర్యావరణ పరిరక్షణలో అందరి పాత్ర అవసరమని వీఎస్‌యూ ఉపకులపతి విజయభాస్కరరావు తెలిపారు. గాంధీ జయంతిని పురస్కరించుకొని కృష్ణపట్నం బీచ్‌లో వీఎస్‌యూ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో బుధవారం తీరంలో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. చెత్తను తొలగించారు. కార్యక్రమానికి ముందు గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్ఈఐఎల్ సంస్థ, ఐఎన్‌జీఎస్ కృష్ణపట్నం కమాండింగ్ అధికారి తమిళ్ సెల్వి, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఉదయ్ శంకర్, ఆచార్యులు సాయినాథ్, సుబ్బారెడ్డి, సుజయ్, గోపికృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వీసీ విజయభాస్కరరావు

సోమశిలకు 6,524 క్యూసెక్కుల వరద

అనంతసాగరం, న్యూస్‌టుడే, సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి బుధవారానికి 6,524 క్యూసెక్కుల వరద నీరు వస్తున్నట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ప్రస్తుతం జలాశయంలో 53.207 టీఎంసీలు నిల్వ ఉంది. -17, -18 రివర్స్ స్లూయిస్ ద్వారా 5, పవర్ టన్నల్ ద్వారా 1,000 క్యూసెక్కులు డెల్టాకు విడుదల చేస్తున్నారు. నాన్‌డెల్టాలైన ఉత్తర కాలువకు 540, దక్షిణ కాలువ ద్వారా కండలేరు వరద కాలువకు 10,000 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.


నిరసన తెలుపుతున్న గ్రామస్థులు

వంతెన నిర్మించమంటే పట్టదా?

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే: మండల పరిధిలో ఎర్రవాగు వద్ద బ్రిడ్జి నిర్మాణానికి స్పష్టమైన హామీ ఇచ్చే వరకు ఆందోళన విరమించబోమని కొండముడుసుపాలెం గ్రామస్థులు బుధవారం రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. కందుకూరు మీదుగా మాలకొండ, పామూరు వైపు జాతీయ రహదారి నిర్మాణం జరుగుతోంది. కందుకూరు నుంచి గుడ్లూరు వెళ్లే ప్రధాన రోడ్డు, జాతీయరహదారి కలిసే కూడలిలో ఎర్రవాగు వద్ద బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని పట్టణవాసులతో పాటు సమీప గ్రామాల ప్రజలు కోరుతున్నా.. జాతీయ రహదారి అధికారుల పట్టించుకోలేదు. దీంతో కొండముడుసుపాలెం గ్రామస్థులు సుమారు 400 మంది ఎర్రవాగు సమీపంలో నిరసన వ్యక్తం చేశారు. ట్రాక్టర్లు అడ్డుపెట్టి వాహనాల రాకపోకలను అడ్డుకున్నారు. దీంతో భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. తహసీల్దారు సయ్యద్ ఇక్బాల్, సీఐ వెంకటేశ్వరరావు, ఎస్సై సాంబశివయ్యలు వారికి నచ్చచెప్పే ప్రయత్నం చేసినా ఆందోళన విరమించలేదు. సబ్‌కలెక్టర్ టి.శ్రీపూజ ఆ ప్రాంతానికి చేరుకుని గ్రామస్థులు, రోడ్డు పనులు చూసే జీఎంతో చర్చించారు. బ్రిడ్జి నిర్మాణంపై కలెక్టర్‌తో మాట్లాడిస్తానని, అప్పటి వరకు పనులు నిలిపివేయాలని సబ్‌కలెక్టర్ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ● గ్రామస్థుల ఆందోళన నేపథ్యంలో పనులు నిలిపివేయాలని రోడ్డు నిర్మాణ సంస్థ జీఎంకు సబ్‌కలెక్టర్ సూచించినా.. బుధవారం సాయంత్రం పనులు ప్రారంభించారు. విషయం తెలుసుకున్న కొండముడుసుపాలెం గ్రామస్థులు అక్కడికి చేరుకుని తిరిగి ఆందోళన వ్యక్తం చేశారు.


ఆలయ పునర్నిర్మాణ మ్యాప్‌ను పరిశీలిస్తున్న అధికారులు

సోమేశ్వరాలయాన్ని సందర్శించిన ఆర్‌జేసీ

అనంతసాగరం, న్యూస్‌టుడే: సోమశిలలోని ప్రముఖ శైవక్షేత్రమైన సోమేశ్వరాలయాన్ని దేవాదాయ శాఖ రాయలసీమ జాయింట్ కమిషనర్ చంద్రశేఖర్ ఆజాద్ బుధవారం సందర్శించారు. ఆలయ ధర్మకర్తలు విజయ్ కుమార్ ఆధ్వర్యంలో ప్రధానార్చకులు రామకృష్ణశాస్త్రి ఆలయ సంప్రదాయాలతో సత్కరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదేశాలతో ఆలయ పునర్నిర్మాణ పనులను పరిశీలించామన్నారు. నిర్మాణాల్లో చేపట్టాల్సిన మార్పులపై మంత్రి ఆనంతో చర్చిస్తామన్నారు. ఆయన వెంట అసిస్టెంట్ కమిషనర్ జనార్దన్‌రెడ్డి, డిప్యూటీ ఈఈ శ్రీనివాసరావు, ఏఈ మురళి, ఆలయ ఏవో ప్రసాద్ రెడ్డి, ఇన్‌స్పెక్టర్ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

దోపిడీ ముఠా అరెస్టు

రూ.4 లక్షల విలువైన సొత్తు స్వాధీనం

నెల్లూరు(నేర విభాగం), న్యూస్‌టుడే: చెడు వ్యసనాలకు బానిసై దొంగలుగా అవతారమెత్తిన నలుగురిని నెల్లూరు గ్రామీణ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.4 లక్షల విలువ చేసే సొత్తుతోపాటు నేరాలకు ఉపయోగించిన కారు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. నెల్లూరుగ్రామీణ పోలీసుస్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇన్‌స్పెక్టర్ జి.వేణు వివరాలు వెల్లడించారు. ఇందుకూరుపేట మండలం పల్లిపాడుకు చెందిన వెంకటేశ్, నెల్లూరు పడారుపల్లికి చెందిన రౌడీషీటర్ గిరీష్‌కుమార్, వెంకటేశ్వరపురం భగత్‌సింగ్ కాలనీకి చెందిన ఫారూక్ కరీముల్లా, ఏడుకొండలు అలియాస్ రాములు స్నేహితులు. వీరు చెడు వ్యసనాలకు బానిసయ్యారు. ఈ క్రమంలోనే ఈ ఏడాది ఏప్రిల్ ఇసుక రీచ్‌లకు సంబంధించిన రూ. 9.43లక్షల నగదును తీసుకెళ్తున్న ఇద్దరిని కోడూరుపాడు రోడ్డులో గుర్తుతెలియని వ్యక్తులు కారుతో ఢీకొట్టారు. దీంతో బైక్‌పై ప్రయాణిస్తున్న వారు కిందపడిపోగా మరో బైక్‌పై వచ్చిన ఇద్దరు నగదు బ్యాగును దోచుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు నెల్లూరు గ్రామీణ పోలీసులు కేసు నమోదు చేశారు. స్థానిక ఇన్‌స్పెక్టర్ జి.వేణు నేతృత్వంలో ప్రత్యేక బృందం దర్యాప్తు ప్రారంభించింది. ఈ క్రమంలో నిందితులు వెంకటేష్, గిరీష్‌కుమార్, కరీముల్లా, ఏడుకొండలుగా గుర్తించారు. బుధవారం వారిని అదుపులోకి తీసుకొని తమదైన శైలిలో విచారించగా దారిదోపిడీకి పాల్పడినట్లు అంగీకరించారు. గిరీష్‌కుమార్ గతేడాది నవంబరులో నెల్లూరు గ్రామీణ మండలం సౌత్‌మోపూరులోని ఓ ఇంట్లో బంగారు ఆభరణం, రూ. 23వేల నగదును అపహరించినట్లు వెల్లడించారు. దాంతో నిందితులను అరెస్టు చేసి వారి వద్ద 28 గ్రాముల బంగారు, సుమారు 75గ్రాముల వెండి ఆభరణాలు, రూ. 2.01లక్షల నగదు, కారు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు గిరీష్‌కుమార్‌పై వేదాయపాలెం, చిన్నబజారు, సంగం పోలీసుస్టేషన్లలో పలు కేసులున్నాయనీ, వేదాయపాలెం పీఎస్‌లో రౌడీషీట్ ఉందని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. నిందితులను అరెస్టు చేసినందుకు కృషి చేసిన గ్రామీణ ఎస్సైలు ప్రసాద్‌రెడ్డి, కె.లక్ష్మణరావు, హెచ్‌సీలు, కానిస్టేబుళ్లను ఇన్‌స్పెక్టర్ అభినందించారు.

క్రీడలతో మమేకం.. విజయాలు సొంతం

మర్రిపాడు (ఆత్మకూరు, గ్రామీణం), న్యూస్‌టుడే: మండలంలోని కృష్ణాపురం జవహర్ నవోదయ విద్యార్థులు.. ఖోఖో, హ్యాండ్ బాల్, బాస్కెట్ బాల్, రోప్ స్కిప్పింగ్, అథ్లెటిక్స్, చెస్ ఇలా.. క్రీడ ఏదైనా తమ సత్తా చాటుతున్నారు. బరిలో దిగితే చిచ్చర పిడుగుల్లా చెలరేగుతున్నారు. అవకాశాలను అందిపుచ్చుకుంటూ విజేతలుగా నిలుస్తున్నారు. క్లస్టర్, రీజనల్, జాతీయస్థాయిల్లో పాల్గొని పథకాలు కొల్లగొడుతున్నారు.

ప్రపంచస్థాయి క్రీడాకారులే ఆదర్శం: తేజశ్వి



ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాను. ఆగస్టులో ఝార్ఖండ్ రాష్ట్రం రాంచిలో జరిగిన జాతీయస్థాయి హైజంప్ అండర్-19 విభాగంలో నాల్గోవ స్థానంలో నిలవడంతో జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యా. క్రీడల వల్ల ఎంతో మంది ప్రపంచస్థాయిలో మంచి గుర్తింపు పొందారు. వారిని ఆదర్శంగా తీసుకుని పోటీలు పాల్గొంటున్నా.

మంచి గుర్తింపు తెచ్చుకుంటా: మధుప్రియ



చిన్నప్పటి నుంచి క్రీడలంటే ఇష్టం. ప్రస్తుతం తొమ్మిదో తరగతి చదువుతున్నా. 2024లో గుంటూరులో జరిగిన రీజనల్ స్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో ప్రతిభ చూపడంతో జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యా. ఆగస్టులో మధ్యప్రదేశ్‌లో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్నా.. మరిన్ని పోటీల్లో పాల్గొని మంచి గుర్తింపు తెచ్చుకుంటా.

ప్రభుత్వ ఉద్యోగమే లక్ష్యం.. అక్షయ



తొమ్మిదో తరగతి చదువుతున్నాను. ఆగస్టులో కర్నూల్‌లో జరిగిన జాతీయస్థాయి స్కిపింగ్ పోటీల్లో పాల్గొని పతకం సాధించాను. చదువుతోపాటు క్రీడాల్లోనూ.. రాణించి ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నా.

మరిన్ని విజయాలు సాధిస్తా.. సాత్విక్



ఎనిమిదో తరగతి చదువుతున్నా. ఆగస్టులో కర్నూలులో జరిగిన రీజనల్ స్థాయి రోప్ స్కిపింగ్ పోటీలో మొదటి స్థానం సాధించాను. కర్ణాటకలోని హాసన్‌లో జరిగిన జాతీయస్థాయి రోప్ స్కిపింగ్ పోటీల్లో రెండోస్థానంలో నిలిచాను. జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు అందుకోవాలన్నదే నా ఆశయం.

గ్రాండ్ మాస్టర్ అవుతా.. భార్గవ్ చంద్రశేఖర్



చిన్నప్పటి నుంచి చదరంగం అంటే ఇష్టం. ప్రస్తుతం ఎనిమిదో తరగతి చదువుతున్నా. ఈ ఏడాది కేరళ రాష్ట్రం మాహేలో జరిగిన రీజనల్ స్థాయి పోటీల్లో మూడో స్థానం సాధించా. ఆగస్టులో అస్సాం రాష్ట్రం ఉడాల్‌గురీలో జరిగిన జాతీయ స్థాయి పోటీలో తొమ్మిదో స్థానంలో నిలిచాను. గ్రాండ్ మాస్టర్ అవ్వాలన్నదే లక్ష్యం.

ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా నడుపుకోవాలి


ఆటో డ్రైవర్లకు సూచనలిస్తున్న సీఐ వెంకటరావు

ఉదయగిరి, న్యూస్‌టుడే : ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా వాహనాలు నడుపుకోవాలని సీఐ వెంకటరావు, ఎస్సై శ్రీనివాసులు ఆటో డ్రైవర్లకు సూచించారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో ఆటో డ్రైవర్లతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బస్టాండ్ ప్రాంతంలో నిలిపి ట్రాఫిక్‌తోపాటు ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్నారని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. అలా వ్యవహరిస్తే చర్యలుంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కావలి

•కావలి • ఉదయగిరి • కందుకూరు

పచ్చదనంతోనే మనుగడ

బిట్రగుంట, న్యూస్‌టుడే: మొక్కలు నాటి సంరక్షిస్తే భావితరాల మనుగడ సాధ్యమవుతుందని బిట్రగుంట ఎస్సై బిజ్యానాయక్ పేర్కొన్నారు. గాంధీ జయంతి సందర్భంగా బుధవారం బోగోలు హరిజనవాడ శ్మశాన వాటికలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో తెదేపా బోగోలు మండల ఎస్సీ సెల్ కార్యదర్శి వెంకట్రావు, మండల ఉపాధ్యక్షుడు ఎల్.సుధీర్, డాక్టర్ విజయేంద్ర, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) కావలి : 80080 51666, 91548 46698
కందుకూరు:70939 81624, ఉదయగిరి : 80085 73944

సమస్య: గ్రామంలోని మస్జిద్ బజారులో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో వృథా నీరు రోడ్డుపై నిలుస్తోంది. **- జమీర్, స్థానికుడు**

సమాధానం : పరిశీలించి చర్యలు తీసుకుంటాం. **- నజీముల్లా, పంచాయతీ కార్యదర్శి - న్యూస్‌టుడే, దుత్తలూరు**

? మా ప్రాంతంలో అయిదు రోజులుగా నీరు రావడం లేదు. ఇలా తరచూ జరుగుతూనే ఉంది. **- నవీన్‌కుమార్, జనతాపేట**

✓ పైపులు మరమ్మతులకు గురయ్యాయి. వాటిని బాగు చేయిస్తున్నాం. పూర్తి కాగానే నీరు సరఫరా చేస్తాం. **- సాయిరాం, పుర డీఈ, - న్యూస్‌టుడే, కావలి**

? స్థానిక ప్రధాన రహదారిపైనే, బంగ్లా కాలనీలో కుక్కల బెడద తీవ్రంగా ఉంది. దాడులు చేస్తున్నాయి. **- వెంగయ్య, వింజమూరు**

✓ ఈ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. **- బి. శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి. - న్యూస్‌టుడే, వింజమూరు**

? గ్రామంలోని గోగులపల్లి రోడ్డు ఆక్రమణలతో ఇరుకుగా మారడంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. **- వెంకయ్య, అల్లూరు**

✓ చర్యలు తీసుకుంటాం. **- నాగరాజు, ఏఈ, ర.భ - అల్లూరు, న్యూస్‌టుడే**

? గ్రామంలోని పటాన్‌వీధిలో వీధిదీపాలు వెలగడం లేదు. **- ఖాదర్, ఉలవపాడు**

✓ రెండు రోజుల్లో సక్రమంగా వెలిగేలా ఏర్పాటు చేయిస్తాం. **- విజయమ్మ, పంచాయతీ కార్యదర్శి -న్యూస్‌టుడే, ఉలవపాడు**

కోర్టు ప్రాంగణంలో స్వచ్ఛతాహీ సేవ


పరిసరాలను శుభ్రం చేస్తున్న న్యాయమూర్తులు, తదితరులు

కావలి, న్యూస్‌టుడే: పట్టణంలోని న్యాయస్థాన ప్రాంగణంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని చేపట్టారు. బుధవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఇ.సుధాకర్, ప్రథమ శ్రేణి అదనపు న్యాయమూర్తి విక్రమ్‌సింహా మాట్లాడుతూ ప్రతిఒక్కరూ వ్యక్తిగత, పరిసర పరిశుభ్రత పాటించడమే గాంధేయ వాదమన్నారు. పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

ఉదయగిరి : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పరిశుభ్రతపై అవగాహన ప్రదర్శన నిర్వహించారు. కళాశాల నుంచి పంచాయతీ బస్టాండ్ సెంటర్ వరకు నినాదాలు చేస్తూ ర్యాలీ చేశారు. శివాలయం, మార్కెట్, పోలీసుస్టేషన్, పంచాయతీ బస్టాండ్ ప్రాంతాల్లో చెత్తాచెదారం తొలగించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ శ్రీనివాసులు, ఎన్ఎస్ఎస్ అధికారి వెంకటసుబ్బయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

క్లాప్ కథ.. నిధులు వృథా!

కదలని చెత్త బుట్టలు.. మూలకి చేరిన ఆటోలు

న్యూస్‌టుడే, కావలి

వైకాపా ప్రభుత్వం ఆర్భాటంగా ఆరంభించిన జగనన్న స్వచ్ఛ సంకల్పం ఆచరణలో విఫలమైంది. ఇందులో ప్రభుత్వ నిధులతో కొనుగోలు చేసిన వాహనాలు నిరుపయోగంగా మారాయి. వాహన చోదకులకు నెలల తరబడి జీతాలివ్వలేదు. విధులు నిర్వహించలేమని నాటి వైకాపా పాలనలోనే సమ్మె బాటలోకి వెళ్లారు.

● ఇళ్లలో నిత్యం వెలువడే చెత్త సేకరించి నెలవారీ రుసుము వసూలు చేయాలనే ఈ పథకం అమలుతీరులో అనేక అక్రమాలు చోటుచేసుకున్నాయి. రాష్ట్ర స్థాయిలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్‌కు ప్రతి నెలా చెత్త పన్ను వసూళ్లను పంపుతూ వచ్చారు. ఈ కార్పొరేషన్ నుంచి వైకాపా ముఖ్య నాయకుడైన గుత్తేదారుకు చేరినా, వారి నుంచి క్లాప్ వాహన చోదకులకు జీతాల రూపంలో చెల్లింపులు జరగలేదు. దీంతో వారంతా విధులకు దూరమయ్యారు. డ్రైవర్ల సమ్మెతో వాహనాలు ముందుకు కదలలేదు. అప్పటి గుత్తేదారుతో సంప్రదించి సమస్య పరిష్కార దిశగా పురపాలక అధికారులు దృష్టి సారించడంలో విఫలమయ్యారు.


ఇవి పట్టణంలోని బాపూజీనగర్ మున్సిపల్ ప్లాట్లలో ఉన్న పార్కులో మూలకి చేరిన చెత్త తరలింపు ట్రక్కు ఆటోలు. క్లీన్ ఆంధ్రప్రదేశ్ జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమంలో (క్లాప్) పట్టణానికి రాగా వినియోగించలేదు. వీటిని ఇలా మూలకు చేర్చారు. రూ.లక్షల ప్రజాధనాన్ని వృథా చేశారు.

పీఎఫ్ సరే..జీతాలూ ఇవ్వలేదు:

దాసరి అశోక్, క్లాప్ వాహన చోదకుడు

నాలుగు నెలల జీతాలు రావాలి. విధుల్లో చేరేటప్పుడు ప్రతి నెలా రూ.18.5 వేల జీతమిస్తామని చెప్పారు. కానీ రూ.12 వేలు ఇచ్చారు. ఆరోగ్య భృతి ఇవ్వనే లేదు. మా పీఎఫ్, ఈఎస్ఐ చందా సొమ్ము మినహాయించుకున్నా ఆయా ఖాతాల్లోకి జమ కాలేదు.

ఇదీ పరిస్థితి

క్లాప్ అమలు	:	2022 అక్టోబరు 2
కేటాయించిన ఆటోలు	:	16
వచ్చిన ఆటోలు	:	6
నెలకు ఒక్కో ఆటోకు అద్దె	:	రూ.60 వేలు
13 నెలలకు చెల్లింపు	:	రూ.46.8 లక్షలు

వారంలో ఆదేశాలు రావచ్చు

మెంతెం శ్రీనివాసులురెడ్డి, సహాయ ఇంజినీర్, పర్యావరణ విభాగం, కావలి పురపాలకం

గతంలో అమలైన స్వచ్ఛ సంకల్పం పథకాన్ని మార్పులు, చేర్పులతో తిరిగి ప్రస్తుత ప్రభుత్వం అమలు చేసే అవకాశాలున్నాయి. ఇందుకు సంబంధించి వారం రోజుల్లోనే ఆదేశాలు రావచ్చంటున్నారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా చూస్తాం. ఇంటింటా చెత్త సేకరణ కొనసాగిస్తాం.

రోడ్డుపై మట్టికుప్ప.. చూడకుంటే ముప్పే!

గ్రామంలోని పుష్కరిణి వద్ద తాగునీటి పైపులైను మరమ్మతుల కోసం గుంత తవ్వి మట్టి రోడ్డుపై పోశారు. రోజులు గడుస్తున్నా తొలగించలేదు. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతుంది. రాత్రిళ్లు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ విషయమై ర.భ ఏఈ నాగరాజును వివరణ కోరగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. **- న్యూస్‌టుడే, అల్లూరు**



పైపు లీకు.. రోడ్డంతా మడుగు



బోగోలులో మండల పరిషత్ పాఠశాలకు పడమరగా ఉన్న రోడ్డు అంచుల్లో మంచినీటి పైప్‌లైను లీకై నీరు వృథాగా పోతోంది. ఈ విషయాన్ని పంచాయతీ కార్యదర్శి జహీర్ దృష్టికి తీసుకెళ్లగా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి సూచనల మేరకు మరమ్మతులు చేయిస్తామన్నారు. **- న్యూస్‌టుడే, బిట్రగుంట**

ప్రహరీ లేక విద్యార్థులకు అవస్థలు

మండలంలోని నేకునాంపేట జడ్పీ పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాఠశాలలోకి పశువులు ప్రవేశించే అవకాశం ఉందని గ్రామస్థులు తెలియజేస్తున్నారు. ఈ విషయమై ఎంఈవో కె.రవికుమార్‌ను వివరణ కోరగా ఉన్నతాధికారులకు తెలియజేశామన్నారు. నిధులు మంజూరు కాగానే నిర్మాణం చేపడతామని తెలిపారు. **- న్యూస్‌టుడే, కొండాపురం**



సంప్‌పై మూతేదీ ?



ఈ చిత్రం కావలి మండలంలోని చెన్నాయపాలెం గ్రామంలో తాగునీటి పథకం సంప్. దీనిపై మూత అమర్చలేదు. దీంతో తాగునీరు కలుషితమవుతుందని గ్రామస్థులు వాపోతున్నారు. ఈ విషయమై ఎండీవో శ్రీధర్ మాట్లాడుతూ మూత ఏర్పాటుచేసి నీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. **- న్యూస్‌టుడే, కావలి**

అలంకరణ కాదండి.. చిగురించిన చెట్టు

ఈ చిత్రం చూశారా! ఇదేదో రహదారి అధికారులు ఇలా సుందరంగా పెట్టారనుకుంటున్నారా.. కాదండి. కొన్నాళ్ల క్రితం మొదలు వదిలేసి కొమ్మలన్నీ కొట్టేశారు. నిన్నటి వరకు మోడుగా కనిపించింది. ఇటీవల కురిసిన వర్షాలకు ఇలా చిగురించింది. ఓగూరువాండ్లపల్లి ఉన్నత పాఠశాల వద్ద చింత చెట్టు ఇలా దర్శనమిస్తోంది. ఈ మార్గంలో వెళ్లే వారు ఆసక్తిగా తిలకిస్తున్నారు. **- న్యూస్‌టుడే, సీతారామపురం**



బాసరలో.. లింగసముద్రం యువకుడి మృతి

లింగసముద్రం : తెలంగాణలోని బాసర సమీపంలో గోదావరినదిలో ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు నీట మునగడంతో లింగసముద్రానికి చెందిన యువకుడు మంగళవారం మృతి చెందారు. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం గ్రామానికి చెందిన వంకదారి హజరత్తయ్య(35) ఇటీవల బేల్దారు పనుల నిమిత్తం బాసర వెళ్లారు. మంగళవారం నదిలో ఈత కొట్టేందుకు దిగారు. ప్రవాహం ధాటికి నీట మునిగారు. గాలింపు అనంతరం మృతదేహం బుధవారం లభ్యమైంది. స్వగ్రామానికి తీసుకువస్తున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

రూ.లక్ష నగదు, బంగారం చోరీ

కలిగిరి, న్యూస్‌టుడే: మండలంలోని వెలగపాడు పంచాయతీ కమ్మవారిపాలెంలో వృద్ధురాలు పొన్నగంటి అంకమ్మ ఇంట్లో మంగళవారం అర్ధరాత్రి రూ.లక్ష నగదు, ఆరు సవర్ల బంగారు నగలు చోరీ అయ్యాయి. అంకమ్మ, ఆమె కుమార్తె మహాలక్ష్మమ్మ మంగళవారం రాత్రి వరండాలో నిద్రించారు. దిండు కింద తాళాలు పెట్టుకున్నారు. అర్ధరాత్రి దుండగులు వచ్చి దిండు కింద ఉన్న తాళాలు తీసుకుని ఇంట్లోకి ప్రవేశించారు. బియ్యం డబ్బాలో దాచుకున్న రూ.లక్ష నగదు, బంగారు సరుడు, జత కమ్మలు, రెండు ఉంగరాలను అపహరించారు. ఉదయాన్నే నిద్ర లేచిన తల్లీకూతుళ్లు ఇంట్లో పరిస్థితిని చూసి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్సై ఉమాశంకర్ వచ్చి పరిశీలించారు.

రూ.2 లక్షల తారు డ్రమ్ములు అపహరణ

కావలి : మండలంలోని రుద్రకోటలో జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న హాట్ మిక్స్ ప్లాంట్‌లో తారు డ్రమ్ములు చోరీ అయ్యాయి. బుధవారం ఈమేరకు ప్లాంటు యజమాని, రహదారుల గుత్తేదారు దశరథరామిరెడ్డి కావలి గ్రామీణ స్టేషన్ ఎస్సై రాజేశ్వరరావుకు ఫిర్యాదు చేశారు. ఎస్సై బాలకృష్ణ వచ్చి విచారించారు. సీసీ కెమెరాల్లో తారు డ్రమ్ములను వాహనంలో తరలించినట్లు రికార్డు అయింది. చోరీ అయిన వాటి విలువ రూ.2 లక్షలు ఉండవచ్చని అంచనా

రెండు ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం

గుడ్లూరు, న్యూస్‌టుడే: స్థానిక శివాలయం వద్ద ఇసుక అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను బుధవారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వెంకట్రావు తెలిపారు. ఉప్పుటేరు నుంచి ఇసుక తరలిస్తున్నారనే సమాచారంతో తనిఖీలు నిర్వహించి స్వాధీనం చేసుకున్నామన్నారు.

పిడుగుపాటుకు పశువుల మృతి: మండలంలోని పూరేటిపల్లిలో బుధవారం పిడుగుపాటుకు గేదె, దూడ మృతి చెందాయి. గ్రామానికి చెందిన రైతు చంద్రమౌళి పొలంలో పశువులు మేపుతుంటుండగా వర్షం కురిసింది. ఆ సమయంలో పిడుగు పడటంతో అవి అక్కడికక్కడే మృతి చెందాయి. వీటి విలువ రూ.లక్ష ఉంటుందని తెలిపారు.

జీబీకేఆర్ కాలనీలో వైద్య శిబిరం


మందులు పంపిణీ చేస్తున్న విశ్రాంత డీఎంహెచ్‌వో మాశిలామణి

వింజమూరు, న్యూస్‌టుడే : మండలంలోని జీబీకేఆర్ గిరిజన కాలనీలో బుధవారం విశ్రాంత డీఎంహెచ్‌వో కె.మాశిలామణి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు జూపల్లి రాజారావు, ప్రీతిక, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

వరికుంటపాడు : గ్రామంలో నూతన స్తంభాల ఏర్పాటు, తీగల మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం అయిదు నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు డిస్కం ఏఈ ఖుద్దూస్‌బాషా తెలిపారు. ప్రజలు, సహకరించాలని కోరారు.


విద్యార్థులతో ప్రధానోపాధ్యాయులు, పీడీ

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

ఉలవపాడు : చాకిచర్ల జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు చెందిన అయిదుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయినట్లు పీడీ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం ప్రకాశం జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో పాల్గొని అండర్-14 విభాగంలో వాలీబాల్, అండర్-17లో హ్యాండ్‌బాల్‌లో వీరంతా ఎంపికయినట్లు తెలిపారు. ఈ నెల 7న రాజమండ్రిలో జరగనున్న హ్యాండ్‌బాల్ టోర్నమెంటులో పాల్గొంటారన్నారు. ప్రధానోపాధ్యాయులు ఆంజనేయులు వారిని అభినందించారు.

అందరికీ తాగునీరే లక్ష్యం

వరికుంటపాడు, న్యూస్‌టుడే: రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని గ్రామంలో అందరికీ తాగునీరు అందిచడమే లక్ష్యమని తెదేపా మండల కన్వీనర్ చంద్రా మధుసూదన్‌రావు, సర్పంచి తెల్లగొర్ల సుశీల ప్రకటించారు. మండలంలోని తొడుగుపల్లిలో బుధవారం కొత్తగా బోరు వేసేందుకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు పలువురు పాల్గొన్నారు.

ఘనంగా గాంధీ జయంతి


చిత్ర పటం వద్ద ఎమ్మెల్యే కాకర్ల సురేష్, తెదేపా నాయకులు

న్యూస్‌టుడే బృందం, కావలి, కందుకూరు, ఉదయగిరి: గాంధీ జయంతి వేడుకలు బుధవారం వాడవాడలా జరిగాయి. కావలి, కందుకూరు, ఉదయగిరి నియోజకవర్గాల్లోని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు తదితర చోట్ల నిర్వహించారు. మహాత్ముడి చిత్రపటాలకు నివాళులర్పించారు. కార్యక్రమాల్లో నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



స్వచ్ఛ సేవకులను సత్కరిస్తున్న డీఎల్‌పీవో కృష్ణమోహన్.. విగ్రహానికి పూలమాల వేస్తున్న ఆర్యవైశ్యులు

ఆలయాలకు ఉత్సవ శోభ


బాలాత్రిపుర సుందరి అలంకారంలో జ్వాలాముఖి అమ్మవారు

కలిగిరి, న్యూస్‌టుడే: మండలంలోని తెల్లపాడు భద్రకాళి ఆలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారు బాలాత్రిపుర సుందరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్థానికులు పూజల్లో పాల్గొని, తీర్థప్రసాదాలు స్వీకరించారు.

దగదర్తి : దగదర్తిలోని దుర్గా భవాని రామలింగేశ్వర స్వామి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ధ్వజారోహణ బుధవారం ఘనంగా జరిగింది. పండితులు విజయకుమార్ ఆచార్య ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. సంతానం లేని వారికి కొడిముద్దలు పంపిణీ చేశారు. రామలింగేశ్వరుడికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, దుర్గాభవానీకి కుంకుమార్చన నిర్వహించారు.


పూజల్లో పాల్గొన్న భక్తులు

ఉదయగిరి : దసరా నవరాత్రి మహోత్సవాలకు పట్టణంలోని ఆలయాలు ముస్తాబయ్యాయి. శివాలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.


ఉదయగిరి: పట్టణంలోని శివాలయం

అమ్మవారు రోజుకో అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారని ఆలయ అర్చకుడు అనిల్ శర్మ తెలిపారు. బీసీ కాలనీలో సంతానలక్ష్మీదేవి, బ్రాహ్మణ వీధిలోని రామాలయం, బాలాజీనగర్‌లో అమ్మ వారికి ప్రత్యేక అలంకరణ చేయనున్నారు.

విద్యార్థులకు అభినందనలు



బిట్రగుంట, న్యూస్‌టుడే: బోగోలులోని హోలీ ఫ్యామిలీ ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థులు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌లో జిల్లా స్థాయి క్రీడలకు ఎంపికవడంతో అధ్యాపకులు వారిని అభినందించారు. బుధవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని గీతాకుమారి, కరస్పాండెంట్ ఆంతోనెట్, వ్యాయామ ఉపాధ్యాయుడు బి.స్టీవెన్‌మార్క్ పాల్గొన్నారు.

టమోటాల లారీ బోల్తా- ట్రాఫిక్‌కు అంతరాయం

దగదర్తి,న్యూస్‌టుడే: మండలంలోని అల్లూరు రోడ్డు వద్ద టమోటాల లోడుతో వెళుతున్న లారీ బుధవారం అదుపు తప్పి బోల్తా పడింది. పోలీసుల కథనం మేరకు.. కర్ణాటకలోని కోలార్ నుంచి పశ్చిమ బంగాకు టమోటాల లోడుతో వెళుతున్న లారీ అల్లూరు రోడ్డు వద్ద అదుపు తప్పి బోల్తాపడింది. అందులోని టమోటాల బుట్టలు రోడ్డుపై పడిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని లారీని తీసి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ప్రాణ నష్టం జరగలేదని పోలీసులు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం

గుడ్లూరు, న్యూస్‌టుడే: మండలంలోని నరసాపురం వద్ద ఇసుకను అక్రమంగా తరలిస్తున్న అయిదు ట్రాక్టర్లను పోలీసులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. లింగసముద్రం మండలం పెదపవని చుట్టు పక్కల గ్రామాల నుంచి మన్నేరు ఇసుకను కావలికి తరలిస్తున్నారనే సమాచారంతో తనిఖీలు నిర్వహించామని ఎస్సై వెంకట్రావు తెలిపారు. ట్రాక్టరు యజమానులపై కేసు నమోదు చేయనున్నట్లు ఎస్సై వివరించారు.

జీవాల అపహరణ

ఉలవపాడు, న్యూస్‌టుడే: కరేడులో గొర్రెలు అపహరణకు గురైనట్లు మద్దిబోయిన రామయ్య అనే రైతు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల మేరకు.. మేతకు పొలానికి తీసుకెళ్లిన గొర్రెలను ఎప్పటిలాగానే మంగళవారం సాయంత్రం దొడ్డిలోకి తోలారు. సుమారు 70కి పైగా ఉన్న దొడ్డిలో 22 జీవాలు అపహరణకు గురయ్యాయి. వీటి విలువ సుమారు.రూ.3లక్షలు ఉంటుందని బాధితుడు తెలిపారు. ఇటీవల మరొక ప్రాంతంలో 20 గొర్రెలు గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారన్నారు.

తవ్వుకో.. అమ్ముకో!

యథేచ్ఛగా సహజ వనరుల దోపిడీ



న్యూస్‌టుడే, దుత్తలూరు, ఉదయగిరి

● ఈ ఏడాది ఆగస్టు నెలలో వరికుంటపాడు మండలంలోని తూర్పుచెన్నంపల్లి పిల్లా పేరు వాగు నుంచి అక్రమంగా ఇసుకను ట్రాక్టర్ల ద్వారా ప్రకాశం జిల్లాకు తరలిస్తుండగా జడదేవి వద్ద స్థానికులు అడ్డుకుని పోలీసులకు అప్పగించారు. వీటిపై కేసు నమోదు చేయాల్సిన పోలీసులు రాజకీయ నాయకుల ప్రమేయంతో పోలీసులు వదిలేశారు.

● గత నెల 13వ తేదీ దుత్తలూరు మండలంలోని ఏరుకొల్లులో ఓ పార్టీ నాయకుడు అనుమతులు తీసుకోకుండా ప్రభుత్వ భూమిలో యంత్రాలతో తవ్వి మట్టిని తరలించారు. స్థానికులు గమనించి ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పోలీసులు వెళ్లి మూడు టిప్పర్లు, ఒక పొక్లెయినరు స్వాధీనం చేసుకున్నారు.

● గత గురువారం కొండాపురం మండలంలోని లింగన్నపాలెం వాగు నుంచి ఇసుక తోడుతుండగా స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి అక్కడ ఉన్న నాలుగు ఇసుక ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

ఉదయగిరి నియోజకవర్గంలో ఇసుక, మట్టి అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. సహజ వనరుల దోపిడీ యథేచ్ఛగా జరుగుతుంది. అధికారం ముసుగులో అనధికారికంగా తవ్వి తరలించుకుపోతున్నారు. నియోజకవర్గంలో ఉన్న వాగులు, వంకలు, ప్రభుత్వ భూముల్లో యంత్రాలతో తవ్వకాలు చేస్తున్నారు. గ్రామస్థులు చెబితేనే పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు.


దుత్తలూరు మండలం ఏరుకొల్లులో మట్టి తరలించిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

నాయకుల అండతో..

రాజకీయ నాయకుల అండ ఉండడంతో అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఎక్కడైనా వాహనాలను పట్టుకున్నా కేసులు నమోదు చేయకుండానే వదిలేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో మరింత బరితెగిస్తున్నారని గ్రామాల ప్రజలు ఆరోపణలు గుప్పిస్తున్నారు. ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయమై తహసీల్దారు కోటేశ్వరరావును వివరణ కోరగా అక్రమ రవాణా నియంత్రణకు చర్యలు తీసుకుంటామని వివరించారు.

సెలవు దినాల్లో...

సెలవు దినాల్లో ఈదందా జోరుగా సాగుతోంది. అధికారులు స్థానికంగా ఉండకపోవడం అక్రమార్కులకు బాగా కలిసొస్తోంది. కొన్ని మండలాల్లో స్థానికుల సమాచారంతో పలు వాహనాలు పట్టుబడుతుండగా గుట్టుచప్పుడు కాకుండా తరలుతున్న వాహనాల లెక్కే లేదు. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో ట్రాక్టర్ ఇసుక ధర రూ. 4 వేల వరకు పలుకుతోంది. ఇక్కడి నుంచి పక్క జిల్లాలకు తరలించి భారీగా సంపాదిస్తున్నారు.

పన్ను వసూలుతో సరి సౌకర్యాలేవీ మరి!

న్యూస్‌టుడే, అల్లూరు

అది మండల కేంద్రం.. పైగా నగర పంచాయతీ..ఎక్కడ చూసినా చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. ఛిద్రమైన రహదారులపై నడక కూడా సాగడం లేదు.. పూడికతో నిండిన కాలువల్లో మురుగునీరు పారక దుర్గంధం వెదజల్లుతోంది. వీటి పరిష్కారం నిమిత్తం పన్నులు వసూలుచేస్తున్నా ఉపయోగం ఉండడం లేదు. ఫలితంగా ప్రజలు నిత్యం నరకయాతన పడుతున్నారు. ఇదీ అల్లూరులోని పరిస్థితి. ఏడాదికి రెండు సార్లు పన్నులు వసూలు చేస్తున్నా ఇళ్ల నుంచి చెత్త సేకరణ జరగడం లేదు. దీంతో ఇళ్లలో వెలువడే వ్యర్థాలను వీధుల్లో వేస్తున్నారు. నార్తుమోపూరు, సింగపేట ప్రాంతాల్లో రోడ్డు పక్కన చెత్త వేస్తున్నారు. మురుగునీటి కాలువల్లో పూడిక తొలగింపు ఊసే లేదు. కనీసం దోమల నివారణకు ఫాగింగ్ చేయడం కూడా మరిచిపోయారు. వీటి కాటుతో ప్రాణాంతక గన్యా, మలేరియా తదితర వ్యాధులు ప్రబలడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.


గ్రామంలో అధ్వానంగా ఉన్న రహదారి

పక్కదారి పడుతున్న ఆదాయం

దుకాణాలు, చేపల చెరువుల నుంచి వచ్చే ఆదాయం పక్కదారి పడుతుందనే విమర్శలున్నాయి. నార్తుమోపూరులో నకిలీ రసీదులు ఇచ్చి ఇంటి పన్ను వసూలు చేసిన సిబ్బందిపై చర్యలు లేవు. 15వ ఆర్థిక సంఘం నిధులు ఎక్కడ వ్యయం చేశారనే వివరాలు లేవు. నగర పంచాయతీగా మారినా సమస్యలు తీరడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై పంచాయతీ కమిషనర్ ఉమామహేశ్వరరావును వివరణ కోరగా సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బాధితులకు ఆర్థికసాయం

మనుబోలు, న్యూస్‌టుడే: వినాయక చవితి వేడుకల్లో భాగంగా బాణసంచా పేలుళ్లు సంభవించి తీవ్రంగా గాయపడిన బాధితులకు అండగా నిలుస్తామని శ్రీసేవానాదం ట్రస్టు వ్యవస్థాపకుడు శ్రీనాథ్‌రెడ్డి అన్నారు. బుధవారం బీసీకాలనీలోని బాధితుల ఇంటికి వెళ్లి పరామర్శించి, వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కాంద్రాతి గిరీశ్‌కు రూ.25 వేలు, మోమిడి లోకేశ్‌కు రూ.20 వేలు, మౌనికకు రూ.5వేలు చొప్పున ఆర్థిక సాయం అందించారు.

అమ్మవారి ఆలయాల ముస్తాబు

కలువాయి, న్యూస్‌టుడే: దేవీ శరన్నవరాత్రుల సందర్భంగా మండలంలోని గ్రామ దేవతల ఆలయాలు విద్యుద్దీపాలంకరణలతో ముస్తాబవుతున్నాయి. మండలంలోని కలువాయి, కుల్లూరు, తోపుగుంట, పెన్నబద్దెవోలు, దాచూరు, కేశమనేనిపల్లి గ్రామాల్లోని ఆలయాల్లో గురువారం నుంచి ప్రత్యేక పూజలు జరగనున్నాయి.

కోవూరు

• కోవూరు • సర్వేపల్లి • ఆత్మకూరు

వీధి దీపాల ఏర్పాటు

స్పందనకు వందనం

కోవూరు: పట్టణంలోని సాయిబాబా ఆలయ పరిసరాల్లో వీధి దీపాలు వెలగడం లేదని స్థానికులు రవీంద్ర 'మేమున్నాం.. మీకు తోడుగా' శీర్షిక కింద ప్రచురించిన చరవాణి నెంబరుకు సమాచారమిచ్చారు. ఆదివారం 'ఈనాడు'లో సమస్య ప్రచురితమైంది. పంచాయతీ కార్యదర్శి శివకుమార్ స్పందించి విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేశారు. సమస్య పరిష్కారమవడంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) కోవూరు : 80085 73987, సర్వేపల్లి : 80085 73980, ఆత్మకూరు: 8008573949

సమస్య: కోవూరు బజారు సెంటరు నుంచి రైల్వేస్టేషన్‌కు వెళ్లే దారిలో రోడ్డు అధ్వానంగా ఉంది. ఆ మార్గంలో రాత్రి సమయాల్లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.
– రమాదేవి, రమణయ్య, కోవూరు

సమాధానం: వెంకటేశ్వరపురం వంతెన దెబ్బతిన్నాక వాహనాలు కోవూరు బజారు కూడలి మీదుగా రాకపోకలు సాగించడంతో రోడ్డు ధ్వంసమైంది. పంచాయతీ రాజ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తాం.
– శివకుమార్, ఈవో, కోవూరు.

? కోవూరు పట్టణంలోని శాంతినగర్ మూడో వీధిలో మురుగు కాలువలు పూడికతో నిండిపోవడంతో దుర్వాసన వస్తోంది.
– శ్రీధర్‌రెడ్డి, శాంతినగర్, కోవూరు.

✔ పరిశీలించి సమస్య పరిష్కరిస్తాం
– శివకుమార్,ఈవో, కోవూరు

? విడవలూరులోని కామాక్షి నగర్ కాలనీలో మురుగు కాలువల్లో పూడిక తీయక పోవడంతో దుర్గంధమయంగా మారింది. దోమలు ప్రబలుతున్నాయి.
– స్థానికులు

✔ పరిశీలించి కాలువల్లో పూడిక తీయించి సమస్య పరిష్కరిస్తాం.
– దశరథరామిరెడ్డి, ఇన్‌ఛార్జి ఎంపీడీవో

? ఇందుకూరుపేట పంచాయతీలో తాగునీరు బురదగా వస్తోంది. స్థానికంగా మురుగు నీటి కాలువలు లేక ఇబ్బందులు పడుతున్నాం. విద్యుత్తు సరఫరా సరిగా లేదు.
– కమలాకర్, స్థానికుడు

✔ పరిశీలించి సమస్యలు పరిష్కరిస్తాం.
– నాగేంద్రబాబు, ఎంపీడీవో

ఎన్నికల హామీలు నెరవేరుస్తాం


దంపూరులో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

కోవూరు, విడవలూరు, న్యూస్‌టుడే: ఎన్నికల్లో చెప్పిన హామీలను నెరవేరుస్తామని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తెలిపారు. కోవూరు మండలం వేగూరులో బుధవారం నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. రూ.4లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్డును ప్రారంభించారు. అనంతరం మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకొని మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన 150 మంది పారిశుద్ధ్య కార్మికులకు సొంత నిధులతో దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచి అమరావతి, ఎంపీపీ పార్వతి, ఎంపీడీవో శ్రీహరి, గ్రామస్థులు పాల్గొన్నారు. విడవలూరు మండలం దంపూరులో సాయిబాబా మందిరం వార్షికోత్సవం సందర్భంగా ప్రశాంతిరెడ్డి పాల్గొని పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. స్థానిక నాయకులు దూది విజయ రాఘవ, కొమ్మి శ్రీధర్ నాయుడు, చేవూరు రాంప్రసాద్, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



ఇందుకూరుపేట, న్యూస్‌టుడే: ఇందుకూరుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన **అఖిల్** రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున్ తెలిపారు. నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి క్రీడామైదానంలో జరిగిన ఎస్‌జీఎఫ్ కబడ్డీ పోటీలలో అండర్-14 బాలుర విభాగంలో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు.

ఆక్రమణల చెరలో ప్రభుత్వ భూములు

న్యూస్‌టుడే, మర్రిపాడు(ఆత్మకూరు గ్రామీణం)

మండల పరిధిలో ఆక్రమణదారులు రెచ్చిపోతున్నారు. ప్రభుత్వ భూములను ఆక్రమించి పాగా వేస్తున్నారు. ముందుగా చదును చేసి ఏదో ఒక పంట సాగు చేసుకుంటూ ఆపై తమ ఆధీనంలోకి తెచ్చుకుంటున్నారు. ఒకరిని చూసి మరొకరు పోటా పోటీగా ఆక్రమణలకు పాల్పడుతుండటం ఆందోళన కలిగిస్తుందని పలువురు వాపోతున్నారు.

పొంగూరు రెవెన్యూలో అంచవాంబ గుడి సమీపంలో 15 ఎకరాల ప్రభుత్వ భూమిని కొందరు యంత్రాలతో చదును చేశారు. ఇదే రెవెన్యూలో తోడేలు వంకను చదును చేసి జామాయిల్ మొక్కలు నాటేందుకు సిద్ధమయ్యారు. కదిరినేనిపల్లి రెవెన్యూలో చెరువు పోరంబోకు భూమి ఉంది. దీనిపై కన్నేసిన అక్రమార్కులు రాత్రికి రాత్రే యంత్రాలను పెట్టి సుమారు 10 ఎకరాల్లో చెట్లను తొలగించారు. అనంతరం పొలాన్ని దున్ని జామాయిల్ నాటేందుకు సిద్ధమయ్యారు. దీనిపై ఫిర్యాదు అందడంతో వీఆర్వో అడ్డుకున్నారు.


కదిరినేనిపల్లిలో చెరువు పోరంబోకు భూమిని చదును చేసిన ఆక్రమణదారులు

ఉపేక్షించేది లేదు

– స్వప్న, తహసీల్దారు, మర్రిపాడు

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు తప్పవు. ఎంతటివారైనా ఉపేక్షించేదిలేదు. మా దృష్టికి వచ్చిన వాటిలో ఇప్పటికే హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశాం. ఆక్రమణలకు పాల్పడే వారిపై కేసులు నమోదు చేసేందుకు సిద్ధంగా ఉన్నాం.

హెచ్చరిక బోర్డులతో సరి

సింగనపల్లిలో సర్వే నం.35, బాట గ్రామంలో సర్వే నం.42లో సుమారు 10 ఎకరాల ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురయ్యాయి. తహసీల్దారుకు ఫిర్యాదు అందడంతో భూ రికార్డులు పరిశీలించి ప్రభుత్వ భూములుగా గుర్తించారు. అనంతరం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. కంపసముద్రంలో సర్వే నం.446, 447, 449లలో సుమారు 50 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమణదారులు చదును చేయడంతో అధికారులు బోర్డులు ఏర్పాటు చేశారు. వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. దీంతో మండల పరిధిలో ఆక్రమణల పర్వం కొనసాగుతూనే ఉంది. వీరిని అడ్డుకోకపోతే ప్రజా అవసరాలకు అంగుళం భూమి కూడా మిగలదన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

కొరిమెర్లలో కుప్ప కూలిన స్తంభాలు

కొరిమెర్లలో బుధవారం సాయంత్రం ఒక్కసారిగా పెనుగాలులు వీచాయి. ఫలితంగా విద్యుత్తు స్తంభాలు సుమారు పది విరిగి కిందపడ్డాయి. అప్పటి వరకు ఎండ తీవ్రతతో ఉన్నవాతావరణం మారింది. దట్టంగా మేఘాలు రావడం, వెనువెంటనే పెనుగాలులు వీయడంతో స్తంభాలు, చెట్లు నేలకొరిగాయి. జనావాసాలపై పడనందున ప్రమాదం తప్పింది. విద్యుత్తు సరఫరా అంతరాయం ఏర్పడింది. డిస్కం సిబ్బంది చర్యలు చేపట్టారు.



– న్యూస్‌టుడే, కొరిమెర్ల (సంగం)

రెండు వరుసల దారి.. కమ్మేస్తున్నాయి మరి!



ఆత్మకూరు- సోమశిల వెళ్లే మార్గమిది. ఆత్మకూరు 3కి.మీ.ల నుంచి అశ్వరిపురం వరకు రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లు పెరిగి దారిని కమ్మేస్తున్నాయి. రెండువరుసల రోడ్డైనా ఆ స్థాయిలో కనిపించడం లేదు. ఎదురుగా భారీ వాహనాలు వచ్చినప్పుడు ద్విచక్రవాహనాలు వెళ్లేందుకు ఇబ్బందులు పడాల్సివస్తోంది. ఇప్పటికైనా ఇరువైపులా చెట్లను తొలగించాలని కోరుతున్నారు.– న్యూస్‌టుడే, ఆత్మకూరు

మట్టి తవ్వకాల అడ్డగింత

తిమ్మాయిపాలెం రెవెన్యూ పరిధిలో మట్టి తవ్వకాలను బుధవారం ఉలపపల్లి గ్రామస్థులు అడ్డుకున్నారు. గ్రామ సమీపంలోని కుంట నుంచి మట్టిని తిమ్మాయిపాలెం గ్రామస్థులు పొలాలకు తరలించేందుకు తవ్వకాలు చేపట్టారు. తమ గ్రామ సమీపంలోని కుంట నుంచి అనుమతులు లేకుండా మట్టి తరలించటానికి వీల్లేదని సర్పంచి, గ్రామస్థులు వారిని అడ్డుకొని యంత్రాలు, ట్రాక్టర్లను వెనక్కి పంపారు. – న్యూస్‌టుడే, చేజర్ల



విద్యుత్తు ప్రమాదాలపై అప్రమత్తమవుదాం



విద్యుత్తు ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని పొదలకూరు ట్రాన్స్‌కో డీఈఈ సుబ్రహ్మణ్యం అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా రైతులు మోటారు స్విచ్ తడి చేతులతో చెప్పులు లేకుండా వేయకూడదన్నారు. పొలాల్లో ప్రమాదవశాత్తు తెగిపడిన వైర్లు తాకొద్దని సూచించారు. వర్షం పడితే ఆ ప్రాంతంలో విద్యుత్తు స్తంభాలు, తీగలు తాకరాదన్నారు. కార్యక్రమంలో ఏఈ శ్రీకాంత్, సబ్ ఇంజినీరు రమేశ్, సిబ్బంది పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, పొదలకూరు

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం

పరిసరాల శుభ్రత పాటిస్తే వ్యాధులు దరిచేరవని ఎంపీడీవో దశరథరామిరెడ్డి అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం ముగింపులో భాగంగా విడవలూరులో తెదేపా నాయకులు, అధికారులు ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయం వద్ద చెత్త తొలగించి శుభ్రం చేశారు. కార్యక్రమంలో నాయకులు సత్యంరెడ్డి, చెముకుల కృష్ణచైతన్య, బెజవాడ గోవర్ధన్‌రెడ్డి, చెముకుల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, విడవలూరు



నాడు నిరుపయోగం.. నేడు మొక్కల పంపిణీ కేంద్రం

న్యూస్‌టుడే, పొదలకూరు

కొన్నేళ్లుగా చెత్త తరలించే వాహనం వినియోగంలో లేక మూలనపడింది... సదరు అధికారిణి వినూత్నంగా ఆలోచించారు.. ఆ వాహనానికి ఆకర్షణీయంగా రంగులు వేశారు.. అందులో పూలు, పండ్ల మొక్కలు ఏర్పాటు చేసి.. ట్రక్ ప్లాంట్‌గా పిలుస్తున్నారు.

● పొదలకూరు మేజర్ పంచాయతీ పరిధిలో చెత్త తరలించేందుకు కొత్త వాహనాలు ప్రభుత్వం మంజూరు చేసింది. సుమారు 12 ఏళ్లుగా వినియోగిస్తున్న వాహనం మూలనపడింది. ఈ క్రమంలో మండల అధికారులు వినూత్న ఆలోచన చేశారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా మొక్కలు ప్రజలకు అందుబాటులో ఉంచితే ఆసక్తి ఉన్న వారు సంరక్షిస్తారని భావించారు. ఉపాధిహామీ సిబ్బందికి ఎంపీడీవో నగేశ్‌కుమారి పలు సూచనలు చేశారు. కొన్నేళ్లుగా నిరుపయోగంగా ఉన్న వాహనాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. దీనిని ట్రక్ ప్లాంట్‌గా నామకరణం చేశారు. ఇనుకుర్తి సామాజిక అటవీ వనం నుంచి మొక్కలు తెప్పించి గాంధీ జయంతి సందర్భంగా పలువురికి ఉచితంగా మొక్కలు అందజేశారు. దాతలు ఎవరైనా మొక్కలందిస్తే వాటిని జాగ్రత్త చేసి పర్యావరణ సంరక్షకులకు అందిస్తున్నారు. మండల పరిషత్తు కార్యాలయ సిబ్బంది బాధ్యత తీసుకున్నారు.

ఎంపీడీవో నగేశ్‌కుమారి మాట్లాడుతూ... ట్రక్ ప్లాంట్ వద్ద ఉన్న వివిధ రకాల మొక్కలు ఉచితంగా పొందవచ్చన్నారు. తీసుకున్న వారు వాటిని నాటి సంరక్షించాలని, అవసరమైన వారు కార్యాలయం వద్దకు వచ్చి తీసుకెళ్లాలని తెలిపారు. ఉపాధిహామీ పథకంలో వనం-మనంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఏటా చేస్తున్నామన్నారు. పలువురికి ఉచితంగా పంపిణీ చేశామన్నారు. అవసరమైన వారు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.


నాడు.. శిథిలావస్థలో చెత్త తరలించే వాహనం ..


నేడు.. మొక్కల పంపిణీ వాహనం

మహాత్ముడి బాట అనుసరణీయం


వీఎస్‌యూలో గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఆచార్యులు, విద్యార్థులు..


సంగంలో..


పొదలకూరులో..

వెంకటాచలం, కోవూరు, విడవలూరు, పొదలకూరు, తోటపల్లిగూడూరు, ఇందుకూరుపేట, మనుబోలు, బుచ్చి, కొడవలూరు, ఆత్మకూరు, సంగం, చేజర్ల, న్యూస్‌టుడే: జాతిపిత మహాత్మా గాంధీ అహింసా సిద్ధాంతాలను యువత ఆచరించాలని వీఎస్‌యూ డిప్యూటి రిజిస్ట్రార్ సాయి ప్రసాద్‌రెడ్డి సూచించారు. గాంధీ జయంతి సందర్భంగా వీఎస్‌యూ ప్రాంగణంలో విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గాంధీజీ ఆశ్రమం అభివృద్ధికి కృషిచేస్తామని కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి పేర్కొన్నారు. ఇందుకూరుపేట మండలం పల్లిపాడులో గాంధీజీ విగ్రహానికి, ఆశ్రమ స్థలదాత పొణకా కనకమ్మ విగ్రహానికి పట్టువస్త్రాలు సమర్పించి పూలమాల వేశారు. శాంతి బాటలో ప్రతిఒక్కరూ నడవాలని తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి తెలిపారు. కోవూరు పట్టణంలోని గాంధీపార్కు వద్ద గల గాంధీ విగ్రహానికి పూలమాలవేశారు. విడవలూరు, పొదలకూరు, తోటపల్లిగూడూరు, మనుబోలు, సంగం, చేజర్లలోని ప్రభుత్వ కార్యాలయాల్లో జరిగిన కార్యక్రమాల్లో పలువురు మాట్లాడుతూ మహాత్ముడి బాటలో నడుద్దామన్నారు. బుచ్చి నగరపంచాయతీలో భాజపా ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. కొడవలూరు మండలం నార్తురాజుపాళెం, కొత్తవంగల్లు, తదితర గ్రామాల్లో పలు కార్యక్రమాలు జరిగాయి. మహాత్మాగాంధీ స్ఫూర్తితో ముందుకు సాగుదామంటూ ఆత్మకూరు పురపాలక ఛైర్‌పర్సన్ వెంకటరమణమ్మ పేర్కొన్నారు. పురపాలక కార్యాలయంలో వార్డు సభ్యులు, సిబ్బంది నివాళులర్పించారు.





కోవూరులో.. విడవలూరులో.. బుచ్చిలో భాజపా నాయకుల ఆధ్వర్యంలో.. ఆత్మకూరు పురపాలక కార్యాలయంలో..

వైద్యుడి ఇంట్లో భారీ చోరీ

30 సవర్ల బంగారం.. రూ 1.5 లక్ష నగదు చోరీ

ఇందుకూరుపేట, న్యూస్‌టుడే: తాళం వేసిన ఇంట్లో 30 సవర్ల బంగారం, రూ.1.5 లక్షల నగదు దోచుకెళ్లిన ఘటన మైపాడులో సంచలనం రేపింది. స్థానికుల వివరాల మేరకు.. మైపాడులో కోటయ్య అనే వైద్యుడు కుటుంబ సభ్యులతో కలిసి రెండు రోజుల క్రితం హైదరాబాద్‌కు వెళ్లారు. గమనించిన గుర్తు తెలియని దుండగులు ఇంటి తలుపులు ధ్వంసం చేసి బంగారం, నగదు అపహరించారు. బుధవారం ఉదయం ఇంటి తలుపులు తెరిచి ఉండటంతో స్థానికులు గమనించి కుటుంబ యజమానికి చెప్పారు. హుటాహుటిన గ్రామానికి చేరుకున్న బాధితుడు పోలీసులను ఆశ్రయించారు. డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు, సీఐ సుధాకర్‌రెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించి చోరీ జరిగిన తీరుపై ఆరాతీశారు. కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


పల్లెనిద్రలో గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎస్సై నరేశ్

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

విడవలూరు, న్యూస్‌టుడే: శాంతి భద్రతలు కాపాడటం, నేరాల నియంత్రణే లక్ష్యమని ఎస్సై నరేశ్ అన్నారు. మండలంలోని అలగానిపాడులోని ఎస్సీ కాలనీలో పల్లె నిద్ర కార్యక్రమం బుధవారం నిర్వహించారు. గ్రామస్థులతో సమావేశమై సమస్యలు, పాత నేరస్థుల కేసుల వివరాలు సేకరించారు. గ్రామాల్లో శాంతిభద్రతలకు భంగం వాటిల్లే చర్యలు తగవన్నారు. కార్యక్రమంలో సర్పంచి శేషయ్య, నాయకులు కొప్పర్తి హరినాథ్, మాజీ సర్పంచి పొనుగోటి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబును కలిసిన మైకా గనుల యజమానులు

సైదాపురం, న్యూస్‌టుడే: అనుమతుల్లేక మూతపడిన మైకాగనులు, కర్మాగారాలను పునరుద్ధరించాలని గూడూరు డివిజన్ మినరల్ ఛాంబర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌ను కలిసి విన్నవించినట్లు ఆ సంఘం నాయకులు ప్రణయ్‌రెడ్డి తెలిపారు. గనులు మూతపడటంతో కార్మికులకు పనులు లేకుండా పోతున్నాయని వారికి విన్నవించినట్లు పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమ దోపిడీతో ప్రస్తుతం అనుమతులు నిలిపివేశామని విచారణ అనంతరం పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు.

గృహ నిర్మాణ సంస్థ పీడీ బాధ్యతల స్వీకరణ

నెల్లూరు(బృందావనం): జిల్లా గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్‌గా తలపల వేణుగోపాల్ ఇటీవల బాధ్యతలు చేపట్టినట్లు ఆ శాఖ అధికారులు తెలిపారు. గతంలో ఇదే శాఖలో ఏఈగా పనిచేశారు. గుంటూరులో సూపరింటెండెంట్ హోదాలో పనిచేస్తూ.. గృహ నిర్మాణ సంస్థ పీడీగా వచ్చారు.

ఉచిత వైద్యశిబిరం

ఆత్మకూరు, సంగం: జండాదిబ్బ గ్రామంలో గాంధీ జయంతి సందర్భంగా బుధవారం తెలుగు యువత ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. నెల్లూరుకు చెందిన ప్రముఖ వైద్య నిపుణులు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆత్మకూరు పురపాలక వైస్ ఛైర్మన్ డాక్టర్ శ్రావణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు.

పురుగు మందు తాగి వృద్ధుడి ఆత్మహత్య

పొదలకూరు, న్యూస్‌టుడే: పురుగుల మందు తాగి వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బత్తులపల్లిలో జరిగిందని ఎస్సై హనీఫ్ తెలిపారు. స్థానికులు, పోలీసుల వివరాల మేరకు... నెల్లూరు గ్రామీణ మండలం ఎల్లంటి గ్రామానికి చెందిన బి.నాగయ్య(75) మంగళవారం రాత్రి పొదలకూరు మండలం బత్తులపల్లిలోని బంధువుల ఇంటికొచ్చారు. రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. కుటుంబ సభ్యులు గుర్తించి నెల్లూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మధ్యాహ్నం మృతిచెందారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం

ఆత్మకూరు, న్యూస్‌టుడే: బొగ్గేరు, పెన్నానది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఆరు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై జిలానీ తెలిపారు. మంగళవారం రాత్రి మండలంలోని ఆరవీడు జంగాలపల్లి నుంచి వింజమూరుకు బొగ్గేరు ఇసుకను అక్రమంగా తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను, బండారుపల్లి వద్ద పెన్నానది నుంచి ఇసుకను తరలిస్తున్న మరో రెండు ట్రాక్టర్‌లు పట్టుకుని కేసులు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

మద్యం పట్టివేత

అనంతసాగరం, న్యూస్‌టుడే: మద్యాన్ని ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై సూర్యప్రకాశ్ రెడ్డి తెలిపారు. అనంతసాగరం బస్టాండ్ సెంటరు నుంచి మన్నెం మహేష్ అనే వ్యక్తి మంగళవారం రాత్రి మద్యం సీసాలను తీసుకువెళుతుండగా స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. బద్వేల్ మలుపు సెంటర్ సమీపంలో సదరు వ్యక్తి ఇంట్లో సోదాలు నిర్వహించగా 50 మద్యం సీసాలను గుర్తించి స్వాధీనం చేసుకుని నిందితుడ్ని అరెస్టుచేశామన్నారు. బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

వెంకటగిరి నియోజకవర్గ సమాచారం

అమ్మణ్ణి ఆలయంలో శరన్నవరాత్రి వేడుకలు

సైదాపురం, న్యూస్‌టుడే: సైదాపురంలోని బాలాత్రిపుర సుందరీదేవి ఆలయంలో గురువారం నుంచి తొమ్మిదిరోజులపాటు శరన్నవరాత్రి వేడుకల్ని అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు ప్రసాద్ తెలిపారు. ఆలయంలో ప్రతిరోజూ అమ్మవారిని ఒక్కో అలంకారంలో పూజలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆలయం వద్ద దాతల సహకారంతో అన్నదానం, సత్సంగ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

కలువాయమ్మకు ప్రత్యేక పూజలు

కలువాయి, న్యూస్‌టుడే: గ్రామదేవత కలువాయమ్మ దేవస్థానంలో అమావాస్య సందర్భంగా బుధవారం దుర్గాదేవి మూలమంత్రంలో హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ సుభిక్షం కోసం ప్రతి అమావాస్య నాడు హోమాది కార్యక్రమాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

భాజపా పాలనలోనే అభివృద్ధి

రాపూరు, సైదాపురం, న్యూస్‌టుడే: భాజపా పాలనలో గ్రామాలు ఎంతో అభివృద్ధి చెందాయని భాజపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎస్ఎస్ఆర్ నాయుడు పేర్కొన్నారు. బుధవారం రాపూరులోని సీవీ కృష్ణయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో భాజపా ఆధ్వర్యంలో చేపట్టిన గాంధీ జయంతి వేడుకల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. సైదాపురం ఎంపీడీవో కార్యాలయంలో సిబ్బంది గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. దేశం కోసం ఆయన చేసిన త్యాగాలను వక్తలు కొనియాడారు. ఎంపీడీవో శివకుమార్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.


రామతీర్థం బీచ్ వద్ద నిర్మించిన రిసార్ట్

వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు ఆహ్లాదంగా గడిపేందుకు కుటుంబ సమేతంగా వస్తే ఎలాంటి వసతుల్లేక ఇబ్బందులు పడుతున్నారు... అప్పటి తెదేపా ప్రభుత్వం రామతీర్థం తీరం వద్ద రూ.2.8 కోట్లతో రిసార్ట్‌తో పాటు పలు భవనాలు నిర్మించారు.. వినియోగంలోకి వస్తే స్థానికులకు ఉపాధి కలుగుతుందని యువత భావించారు.. 2019 ఎన్నికల్లో వైకాపా ప్రభుత్వం ఏర్పడిన అనంతరం వీటి గురించి పట్టించుకోలేదు. నిర్లక్ష్యంగా వదిలేయడంతో అయిదేళ్లు రిసార్ట్ నిరుపయోగంగా ఉంది. పర్యాటకుల కోసం ఏర్పాటు చేసిన కుటీరాలు భారీ వర్షాలకు ధ్వంసమయ్యాయి. –న్యూస్‌టుడే, విడవలూరు

పర్యాటక కేంద్రం..
వసతులు మృగ్యం

● కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వీటిని వినియోగంలోకి తెస్తే స్థానికంగా ఉపాధి దొరుకుందని యువత భావిస్తున్నారు. ఈ బీచ్‌ను ప్రైవేట్ సంస్థకు అప్పగించడంతో పర్యాటకులకు మెరుగైన వసతులు కల్పిస్తారని ఆశిస్తున్నారు. కోవూరు నియోజకవర్గంలో మైపాడు బీచ్‌లో రిసార్టు, వసతులు కల్పించడంతో వివిధ ప్రాంతాల నుంచి ఎక్కువ మంది వస్తున్నారు. అదే తరహాలో రామతీర్థం బీచ్ అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు. ప్రసిద్ధ శైవ క్షేత్రం కామాక్షితాయి రామలింగేశ్వరస్వామి ఆలయముంది. ఏటా ఇక్కడ జరిగే స్వామి వారి బ్రహ్మోత్సవాలకు భక్తులు ఎక్కువ సంఖ్యలో వస్తారు. ప్రభుత్వ పరంగా వసతులు కల్పిస్తే భక్తులతో పాటు, పర్యాటకులు పెరిగే అవకాశముంది.

● పంచాయతీ కార్యదర్శి సుమంత్ మాట్లాడుతూ.. రామతీర్థం బీచ్ ప్రైవేట్ సంస్థకు ప్రభుత్వం లీజుకిచ్చిందన్నారు. రిసార్టు వద్ద ఈత కొలను, కాటేజీలు ఇతర వసతులు కల్పిస్తారన్నారు. త్వరలో అందుబాటులోకి వస్తుందన్నారు.

నెల్లూరు

• నెల్లూరు • నెల్లూరు గ్రామీణం


ఎస్సై దంపతులను సన్మానిస్తున్న ఎస్పీ

శేష జీవితం సుఖంగా గడపండి: ఎస్పీ

నెల్లూరు(నేర విభాగం), న్యూస్‌టుడే: శేష జీవితం సుఖంగా గడపాలని ఎస్పీ జి.కృష్ణకాంత్ అన్నారు. ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన పోలీసు కంట్రోల్ రూమ్ ఎస్సై ఎం.రాంబాబును బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన సన్మానించారు. ఆర్ఐ రాజారావు, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ బి.శ్రీనివాసరెడ్డి, పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దిపాటి ప్రసాదరావు పాల్గొన్నారు.

వ్యాపారులకు ప్రభుత్వం అండ: కోటంరెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), న్యూస్‌టుడే: 'వైకాపా ప్రభుత్వంలో ఆర్యవైశ్యులు వ్యాపారాలు చేసుకోవాలంటేనే భయపడాల్సిన పరిస్థితి ఉండేది.. తెదేపా ప్రభుత్వ వ్యాపారులకు అండగా ఉంటామని తెదేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. ది నెల్లూరు ఆర్యవైశ్య బులియన్ మర్చంట్ పాన్ బ్రోకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వృద్ధాప్య ఫించన్ల పంపిణీ కార్యక్రమం బుధవారం నగరంలోని సంఘ కార్యాలయంలో జరిగింది. సంఘ నాయకులు కొనగళ్ల శోభన్‌బాబు, అమరా శివ, ఫణీంద్రకుమార్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.


వృద్ధురాలికి పింఛను అందజేస్తున్న తెదేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) నెల్లూరు, గ్రామీణం 80085 50332 80085 74001

సమస్య: చంద్రబాబునగర్‌లో పందుల బెడద ఎక్కువగా ఉంది. – సుబ్బమ్మ

సమాధానం: పందులను నగరానికి దూరంగా తరలించేందుకు చర్యలు చేపడతాం. –డాక్టర్ మదన్‌మోహన్, వెటర్నరీ అధికారి

? వెంకటేశ్వరపురంలో డ్రైనేజీలు పూడికతో నిండిపోయాయి. – సుశీల

✓ డ్రైనేజీల్లో పూడికతీత పనులు చేపడతాం. – డాక్టర్ చైతన్య, ఆరోగ్యాధికారి

–న్యూస్‌టుడే, నెల్లూరు(నగరపాలక సంస్థ)

విశ్రాంత హిందీ ఉపాధ్యాయుడికి సన్మానం

నెల్లూరు(విద్య): విశ్రాంత హిందీ ఉపాధ్యాయుడు కాంతారావును బుధవారం నెల్లూరు పురమందిరంలోని రీడింగ్‌రూమ్‌లో సన్మానించారు. ఈ సందర్భంగా హిందీ ఉపాధ్యాయిని నాగేశ్వరమ్మ మాట్లాడుతూ విద్యార్థులు జాతీయ భాషను అనర్గళంగా మాట్లాడేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు సాధించిన పలువురిని సన్మానించారు. హిందీ ఉపాధ్యాయులు ప్రసన్నలక్ష్మి, సుధావణి పాల్గొన్నారు.

రోడ్డుపైనే వాహనం.. సాగేదెలా పయనం

రాకపోకలకు అంతరాయం ● పట్టించుకోని అధికారులు

న్యూస్‌టుడే, నెల్లూరు(నేర విభాగం)

ఇటీవల అయ్యప్పగుడి నుంచి మినీబైపాస్‌కు వెళ్లే దారిలో బ్రిడ్జి దిగిన తర్వాత ఓ స్కూలు బస్సు అదుపు తప్పింది. దాంతో రోడ్డు పక్కనే ఆగి ఉన్న వాహనాలను ఢీకొంది. దీంతో అయిదారు వాహనాలు దెబ్బతిన్నాయి.

ఈ ప్రాంతాల్లో అయితే దారుణం..

నగరంలోని పలు ప్రాంతాలకు వెళ్లేందుకు ప్రజలు పాదచారులు అవస్థలు పడుతున్నారు. ఎక్కడ పడితే అక్కడ వాహనాలు ఆపేయడం, రద్దీ ఎక్కువగా ఉండటం, గుంటలకొద్దీ వాహనాల నిలుపుదలతో ఈ ప్రాంతాల్లో వెళ్లాలంటేనే భయపడుతున్నారు. ముఖ్యంగా స్టోన్‌హౌస్‌పేటలో పరిస్థితి దారుణంగా ఉంది. ఇక్కడ ఆటోలు రోడ్డుపై అడ్డంగా నిలిపేస్తున్నారు. చిన్నబజారు, పెద్ద బజారు ప్రాంతాల్లో వ్యాపారులు రోడ్లపైకి సరుకు తెచ్చి విక్రయిస్తున్నారు. కపాడిపాళెం, గాంధీబొమ్మ, పొగతోట, వీఆర్సీ సెంటరు, మద్రాసు బస్టాండ్ తదితర ప్రాంతాల్లో ఇదే పరిస్థితి. ఆటోలు, కార్లు ఇష్టారాజ్యంగా రోడ్లపైనే పార్కింగ్ చేస్తుంటారు. ఆ ప్రాంతంలో ట్రాఫిక్ పోలీసులు ఉన్నా.. పట్టించుకోరనే ధీమాతో ఉంటున్నారు.

సామాజిక బాధ్యతేదీ?

రోడ్లపై వాహనాలు ఆపేసే వెనక వచ్చే పరిస్థితి ఎలా అని.. కనీసం జ్ఞానం లేకుండానే ఉంటున్నారు. స్వార్థపూరితంగా వ్యవహరించడం వల్ల ప్రజలకు ట్రాఫిక్ వెతలు తప్పడం లేదు. ట్రావెల్స్, వస్త్ర దుకాణాలు, హోటళ్ల నిర్వాహకులకు భవనాల సెల్లార్లలో వాహనాల పార్కింగ్ ఉండటం లేదు. వివిధ పనుల నిమిత్తం వచ్చేవారు రోడ్లపైనే వాహనాలు నిలిపేసి.. సెల్‌ఫోన్లలో మాట్లాడుతున్నారు. అదేమని ప్రశ్నిస్తే గొడవలకు దిగుతున్నారు.

ఎక్కడ పడితే అక్కడ వాహనాలు ఆపేయడం..

ఎవరికి వారు నిబంధనలు అతిక్రమించి పార్కింగ్ వసతుల్లేకుండా స్థలం హద్దు వరకు భవనాలు నిర్మించేస్తున్నారు. దీంతో నగరంలోని ప్రధాన రహదారులు పార్కింగ్ స్టాండ్లను తలపిస్తున్నాయి. ఆ భవనాల్లో వ్యాపారాలు ఏర్పాటు చేశాక వాహనచోదకులు రహదారులపైకి వాహనాలను నిలపడం సర్వసాధారణమైంది. [illegible] ట్రాఫిక్ పోలీసులు, నగరపాలక సంస్థ అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తుండటంతో ఆక్రమణదారులు ఆడిందే ఆట.. పాడిందే పాటగా తయారైంది. ఫలితంగా రద్దీ సమయాల్లో వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్ సమస్య తలెత్తి ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది.


కాపువీధిలో ఎక్కడపడితే అక్కడ వాహనాలు నిలిపేసి..


చిన్న బజారులో వ్యాపారాలు రోడ్డుపైకి రావొద్దని సూచిస్తున్న ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు

పగలే చుక్కలు కనిపిస్తాయి ఇక్కడ!

పెద్దబజారు నుంచి చిన్నబజారుకు వెళ్లాలంటే పగలే చుక్కలు కనిపిస్తాయి. వ్యాపారులు రోడ్డును ఆక్రమించేసి తమ వస్తువులు పెట్టేస్తుంటారు. దీంతో రోడ్డు కుంచించుకుపోయి వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

చిన్నబజారు నుంచి కష్టాలు ప్రారంభం..

చిన్నబజారు, పెద్దబజారు ప్రాంతాల్లో ట్రాఫిక్ కష్టాలు లేవంటూ స్థానిక ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు చొరవ చూపుతున్నారు. ఇటీవల కాలంలో ఆయన పరిధిలోని ప్రాంతాల్లో పర్యటించారు. వ్యాపారాలు రోడ్లపైకి రావడాన్ని గుర్తించి వాటిని వెనక్కి పంపించారు. ఈ నేపథ్యంలో నగరంలోని దాదాపు అన్ని ప్రాంతాల్లో ఇలాంటి స్పెషల్ డ్రైవ్ చేపడితే బాగుంటుంది. నిబంధనలు అతిక్రమిస్తున్న వారిని గుర్తించి హెచ్చరిస్తే సమస్య పరిష్కారమవుతోంది. దాంతో పాటు ములుమూడి బస్టాండు నుంచి చిన్నబజారు, పెద్దబజారు ప్రాంతాల్లో వెళ్లేందుకు గతంలో నిషేధించారు. కేవలం వన్ వే మాత్రమే ఏర్పాటు చేశారు. అయితే, ఆ నిబంధనలు ఎవరూ పాటించడం లేదు. ప్రధాన ప్రాంతాల్లో నిత్యం ట్రాఫిక్ పోలీసుల గస్తీ పెంచితే.. రోడ్లపై వాహనాలు ఆపకుండా వెళ్తాయి.

కాంగ్రెస్ నిరసన ప్రదర్శన

నెల్లూరు(జడ్పీ), న్యూస్‌టుడే: డీసీసీ అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం నెల్లూరులోని గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పార్టీ జిల్లా ఇన్‌ఛార్జి ఎం.గోపాల్‌రెడ్డి హాజరయ్యారు. ముందుగా కాంగ్రెస్ జిల్లా కార్యాలయం నుంచి నెల్లూరు నగర, గ్రామీణ కాంగ్రెస్ పార్టీ నేతలు ప్రదర్శన నిర్వహించారు. విజయమహల్ గేట్ సెంటర్ నుంచి ట్రంకురోడ్డు ప్రధాన వీధుల మీదుగా ఈ ప్రదర్శన సాగింది. మహాత్ముడి విగ్రహానికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్‌ఛార్జి గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. నాయకులు టి.వెంటనర్సింహులు, వేటూరి శ్రీనివాసులరెడ్డి, షేక్ ఫయాజ్, బాలసుధాకర్, గణేశ్, బిట్రగుంట సురేష్, మోహన్‌రెడ్డి, సంజయ్, కిశోర్‌రెడ్డి, సుజాత, రాజేష్, నాగిరెడ్డి పాల్గొన్నారు.


ర్యాలీలో కాంగ్రెస్ నాయకులు

వైజాగ్ స్టీల్ ప్లాంట్‌ను కాపాడాలి

నెల్లూరు(విద్య): వైజాగ్ స్టీల్ ప్లాంట్‌ను కాపాడాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. నగరంలోని బుధవారం ఆత్మకూరు బస్టాండు నుంచి వైజాగ్ స్టీల్ ప్లాంట్‌ను పరిరక్షించాలంటూ ఏఐటీయూసీ, సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడోసారి అధికారంలోకి వచ్చిన ఎన్డీయే ప్రభుత్వం ఈ పరిశ్రమను ప్రైవేట్‌పరం చేయడానికి తీవ్రంగా ప్రయత్నిస్తోందని ఆవేదన చెందారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్, ఏఎఫ్‌టీయూ జిల్లా నాయకులు సాగర్, ఏఐఎఫ్‌టీయూ న్యూ నాయకులు యానాదయ్య, జిల్లా అధ్యక్షులు టీవీవీ ప్రసాద్, నగర కార్యదర్శి నాగేశ్వరరావు, కిన్నెర కుమార్ పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

నింగీనేలా ఒక్కటైనట్టు!



ఆకాశం మేఘావృతమైంది. మబ్బులు కమ్మి ఉరుములు మెరుపులతో కూడిన వర్షం పడింది. బుధవారం ఉదయం నుంచి 40 డిగ్రీలకు పైగా ఎండ ఉక్కపోతతో జనం విలవిల్లాడారు. సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. ఉరుములు.. మెరుపులతో ఆకాశం మేఘావృతమవడంతో నగరవాసులు ఆసక్తిగా తిలకించారు. నెల్లూరులోని స్వర్ణాల చెరువులో ఆకాశం నీటిని తాకుతున్నట్లుగా కన్పించడంతో ప్రజలు ఆసక్తిగా తిలకించారు. –న్యూస్‌టుడే, నెల్లూరు(నగరపాలక సంస్థ)

చేతిరాత శిక్షణ అభినందనీయం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): అచరిత్వ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు ఒక రోజు చేతిరాత శిక్షణ కార్యక్రమం బుధవారం దర్గామిట్ట సెయింట్ జోసెఫ్ స్కూల్‌లో జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన నెల్లూరు డివిజన్ ఉప విద్యాశాఖాధికారి ప్రసన్నలక్ష్మి మాట్లాడారు. ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్న అచరిత్వ ఫౌండేషన్ ఛైర్మన్, ఆంగ్ల ఉపాధ్యాయుడు కృపాల్, సభ్యులు సురేష్, రత్నాకర్ ఎంతో అభినందనీయులని కొనియాడారు.



మాట్లాడుతున్న నెల్లూరు డివిజన్ ఉప విద్యాశాఖాధికారి ప్రసన్నలక్ష్మి

జనసేన నగర సంకీర్తన


నగరంలో జరిగిన సంకీర్తనలో జనసేన నాయకులు

నెల్లూరు(వీఆర్సీ సెంటరు), న్యూస్‌టుడే: ఉప సీఎం పవన్ కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా జనసేన నాయకులు ఆధ్వర్యంలో బుధవారం నగర సంకీర్తన జరిగింది. నగరంలోని గాంధీబొమ్మ నుంచి కార్యక్రమం మొదలైంది. నగర వీధుల్లో సంకీర్తన జరిగింది. ఈ సందర్భంగా జనసేన నాయకులు నూనె మల్లికార్జునయాదవ్ మాట్లాడారు. సురేంద్ర, రామిరెడ్డి, షేక్ నజీర్, గునుకుల కిశోర్, గునుకుల విజయలక్ష్మి, శ్రీరామ్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

కాలభైరవుడికి మహాలయ అమావాస్య పూజలు

నెల్లూరు(జడ్పీ), న్యూస్‌టుడే: మహాలయ అమావాస్య గడియలు కలసి రావడంతో బుధవారం భక్తులు మూలాపేట ఆలయంలో కొలువుదీరిన కాలభైరవుడికి పూజలు చేశారు. కనకదుర్గమ్మ తల్లిని మల్లెపూలతో అలంకరించారు. మహిళలు హారతులిచ్చారు.


పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

చికిత్స పొందుతూ మృతి

నెల్లూరు(నేర విభాగం), న్యూస్‌టుడే: ఓ వ్యక్తి ఆత్మహత్యా యత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందిన ఘటన ఇది. పల్లిపాడులో ప్రభాకర్(40) కుటుంబం నివాసం ఉంటున్నారు. ఆయన భార్య మూడేళ్ల క్రితం మృతి చెందారు. తన ఇద్దరు పిల్లలతో కలిసి జీవిస్తున్నారు. మద్యానికి బానిస కావడంతో ఆయన ఆరోగ్యం దెబ్బతిన్నది. దీంతో నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చూపించుకుని చికిత్స పొందుతున్నారు. అయినా, ఆరోగ్యం కుదుటపడలేదు. దీంతో మనస్తాపానికి గురైన ఆయన.. కోడూరుపాడు శివారులోని గుడివద్ద పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ప్రభాకర్ కుమారుడు శ్రీకాంత్ బైక్‌పై అటుగా వెళ్తూ తండ్రిని గమనించాడు. 108 సాయంతో ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆయన మృతి చెందారు. ఈ మేరకు శ్రీకాంత్ బుధవారం నెల్లూరు గ్రామీణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రక్షణ కల్పించాలని నవదంపతుల వేడుకోలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), న్యూస్‌టుడే: తాము ఇష్టపూర్వకంగా పెళ్లి చేసుకున్నామనీ, తమకు రక్షణ కల్పించాలని నెల్లూరు రూరల్ ఇందిరమ్మ కాలనీకి చెందిన ఏడుకొండలు, మౌనిక కోరారు. నగరంలోని జిల్లా జర్నలిస్టు భవన్‌లో బుధవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. కులాలు వేరని కుటుంబసభ్యులు తమ వివాహాన్ని ఒప్పుకోవడం లేదని తెలిపారు.

సారా విక్రయాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడులు

నెల్లూరు(నేర విభాగం), న్యూస్‌టుడే: నాటుసారా విక్రయాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బుధవారం దాడులు చేశారు. ఏడు లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. ప్రొహిబిషన్ అండ్ ఇన్‌స్పెక్టర్ వైవీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఈ దాడులు జరిగాయి. బోగోలు నుంచి నాటుసారా తీసుకొచ్చి హరనాథపురంలో విక్రయిస్తున్న యాకోబును ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. అతని వద్ద ఏడు లీటర్ల నాటసారా, స్కూటీని స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్సై కాలేషావలి, హెడ్‌కానిస్టేబుల్ ఎ.రమేశ్‌కుమార్, ఎం.కిరణ్‌సింగ్, కానిస్టేబుళ్లు తులసీదాస్, పెంచలయ్య పాల్గొన్నారు.

తెరపై ఈనాడు

ఎం-1 సినిమాస్-స్క్రీన్1..స్క్రీన్-2.. దేవర, స్క్రీన్3.. సత్యం సుందరం, స్పైస్‌సినిమాస్(ఎంజీబీ మాల్)- స్క్రీన్1.. దేవర, స్క్రీన్2..దేవర, సత్యం సుందరం, స్క్రీన్3..స్క్రీన్4..స్క్రీన్5.. దేవర, రెయిన్ సినిమాస్-స్క్రీన్1..దేవర, స్క్రీన్2..జోకర్(ఇంగ్లీష్), దేవర, స్క్రీన్3..దేవర, జోకర్(ఇంగ్లిష్), స్క్రీన్4.. సత్యం సుందరం, సిరిమల్టీప్లెక్స్..స్క్రీన్1..స్క్రీన్2.. దేవర, స్క్రీన్3..సత్యం సుందరం.


నెల్లూరు (వేదాయపాళెం): శ్రీవెంకటేశ్వర కళాశాలలో..


నెల్లూరు (వేదాయపాళెం): విశ్వసాయి కళాశాలలో..



నెల్లూరు (నగరపాలక సంస్థ): తెదేపా నాయకులు.. మేయరు స్రవంతి నివాళి

బాపూజీ జీవితం ఆదర్శనీయం: ఎస్పీ

బాపూజీ జీవితం ప్రపంచానికి ఆదర్శనీయమని ఎస్పీ జి.కృష్ణకాంత్ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన మహాత్ముడి జయంతి వేడుకల్లో ఆర్ఐ రాజారావు, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ బి.శ్రీనివాసరెడ్డి, మద్దిపాటి ప్రసాదరావు పాల్గొన్నారు. కలెక్టరేట్ ఆవరణలోని గాంధీజీ విగ్రహానికి జేసీ కార్తిక్ పూలమాలలేసి నివాళులర్పించారు. జడ్పీ కార్యాలయంలో జడ్పీ ఛైర్‌పర్సన్ అరుణమ్మ హాజరయ్యారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో మేయర్ పొట్లూరి స్రవంతి, కమిషనర్ సూర్యతేజ, కార్పొరేటర్ సత్తార్ పాల్గొన్నారు. తెదేపా జిల్లా కార్యాలయంలో జాతిపిత చిత్రపటానికి, ట్రంకురోడ్డులోని విగ్రహానికి పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ నిమితులైన అబ్దుల్ అజీజ్ పూలమాలలేసి నివాళులర్పించారు. బార్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఉమామహేశ్వర్, ఎమ్.సుందరయ్య యాదవ్ ఆధ్వర్యంలో జయంతి జరిగింది. శ్రీవెంకటేశ్వర కళాశాల ఆఫ్ ఇంజినీరింగ్ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ సి.ప్రకాశ్‌రావు, ఛైర్మన్ పి.గుణశేఖర్ పాల్గొన్నారు. విశ్వసాయి కళాశాలలో ఛైర్మన్ సత్యనారాయణ, వైస్‌ఛైర్మన్ కృష్ణమోహన్ పాల్గొన్నారు. ఏపీఎన్జీవోస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో జిల్లా అధ్యక్షులు పెంచలరావు పాల్గొన్నారు. కోటమిట్ట సీహెచ్‌సీలో భాజపా, డీకేడబ్ల్యూ కళాశాలలో, సంతపేట ఆదర్శ పాఠశాల స్కౌట్స్, నావల్ విద్యార్థులు గాంధీ జయంతి నిర్వహించారు. -న్యూస్‌టుడే బృందం


నెల్లూరు (జడ్పీ): జడ్పీ కార్యాలయంలో..


నెల్లూరు (జడ్పీ): వేడుకల్లో స్కౌట్, నావెల్ శిక్షణ విద్యార్థులు

తెదేపా రాష్ట్ర కార్యదర్శి రాజానాయుడు జన్మదినం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), న్యూస్‌టుడే: తెదేపా రాష్ట్ర కార్యదర్శి, మార్కాపురం పార్టీ పరిశీలకులు దొడ్డపనేని రాజానాయుడు జన్మదిన వేడుకలు బుధవారం జరిగాయి. నగరంలోని ఆయన నివాసంలో జరిగిన కార్యక్రమంలో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఆయన సోదరుడు గిరిధర్‌రెడ్డిలతోపాటు తెదేపా యువ నాయకుడు వేలూరు కల్యాణ్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కేక్ కోసి రాజానాయుడికి శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు జన్ని రమణయ్య, మన్నెం పెంచలనాయుడు, రఘురామయ్య, మునిశేఖర్ నాయుడు, సాయిసునీల్, కార్పొరేటర్ అహల్య, రాజేశ్, సుబ్బన్న పాల్గొన్నారు.

అవినీతిపై విచారణ చేయాలి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), న్యూస్‌టుడే: అల్లూరు నగర పంచాయతీ కార్యాలయం టౌన్‌ప్లానింగ్ విభాగంలో అవినీతి జరుగుతోందనీ, విచారణ జరపాలని ఆర్.చెన్నకేశవులు కోరారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనుమతులు లేని ఇళ్ల యజమానుల నుంచి ముడుపులు తీసుకుంటూ చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. ఒకటో సచివాలయం ప్రాంతంలో ఓ ఇంటి యజమాని అనుమతి తీసుకోకుండా నిర్మాణాలు చేపట్టారని ఫిర్యాదు చేసినా.. చర్యలు తీసుకోలేదన్నారు.

ఆదమరిస్తే.. ప్రమాదమే!



నెల్లూరు నగరంలోని మద్రాసు బస్టాండు వద్ద ప్రధాన జీఎన్‌టీ రోడ్డుపై పశువుల కారణంగా నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ఏసీ మార్కెట్‌లో వ్యర్థాలను తిన్న పశువులు రోడ్డుపై అడ్డంగా పడుకొంటున్నాయి. నిత్యం వేలాది వాహనాలతో రద్దీగా ఉండే ప్రాంతంలో పశువుల కారణంగా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. పశువులను గోశాలకు తరలించేందుకు చర్యలు చేపడతామని వెటర్నరీ అధికారి మదన్‌మోహన్ తెలిపారు. –న్యూస్‌టుడే, నగరపాలక సంస్థ

నేరస్థుల కదలికలపై నిఘా: డీఎస్పీ

నెల్లూరు(నేర విభాగం), న్యూస్‌టుడే: శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో గురువారం నుంచి జరగనున్న శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలకు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. దేవస్థానం వద్ద పోలీసు కంట్రోల్ రూమ్‌ను, ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా 130 మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. నగర డీఎస్పీ డి.శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో ముగ్గురు ఇన్‌స్పెక్టర్లు, ఏడుగురు ఎస్సైలు, 25 మంది ఏఎస్సైలు, హెచ్‌సీలు, 74 మంది కానిస్టేబుళ్లు, 20 మంది మహిళా కానిస్టేబుళ్లు బందోబస్తు విధుల్లో పాల్గొననున్నారు. బుధవారం రాత్రి బందోబస్తు విధులకు హాజరైన సిబ్బందికి డీఎస్పీ దిశానిర్దేశనం చేశారు. క్రైమ్‌పార్టీలు అనుమానాస్పద వ్యక్తులు, నేరస్థుల కదలికలపై నిఘా ఉంచాలన్నారు. డీఎస్పీ వెంట దర్గామిట్ట, సంతపేట, వేదాయపాలెం ఇన్‌స్పెక్టర్లు రోశయ్య, మద్ది శ్రీనివాసరావు, కిశోర్‌కుమార్ ఉన్నారు.

గృహ నిర్మాణ సంస్థ పీడీ బాధ్యతల స్వీకరణ

నెల్లూరు(బృందావనం): జిల్లా గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్‌గా తలపల వేణుగోపాల్ ఇటీవల బాధ్యతలు చేపట్టినట్లు ఆ శాఖ అధికారులు తెలిపారు. వేణుగోపాల్ గతంలో జిల్లాలో ఇదే శాఖలో ఏఈగా పనిచేశారు. గుంటూరులోని ప్రధాన కార్యాలయంలో సూపరింటెండెంట్ హోదాలో పనిచేస్తూ.. గృహ నిర్మాణ సంస్థ పీడీగా వచ్చారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), న్యూస్‌టుడే: నగరంలోని జిల్లా కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్(డీసీసీబీ) కార్యాలయ ఆవరణలో జరిగిన మొక్కలు నాటే కార్యక్రమంలో బుధవారం జేసీ, పర్సన్ ఇన్‌ఛార్జి కె.కార్తిక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలన్నారు. డీసీసీబీ సీఈవో, నాబార్డు డీడీఎం, డీసీఏవో, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.


మొక్క నాటుతున్న జేసీ కార్తిక్

ఎస్బీఐ సిబ్బంది స్వచ్ఛతా హీ సేవా

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), న్యూస్‌టుడే: భారతీయ స్టేట్ బ్యాంక్ నెల్లూరు ప్రాంతీయ కార్యాలయం సిబ్బంది బుధవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. నగరంలోని చిల్డ్రన్ పార్కు ప్రాంతంలో పరిసరాలను శుభ్రం చేశారు. ఎస్బీఐ రీజనల్ మేనేజర్ ఎన్.శ్రీనివాసరావు, చీఫ్ మేనేజర్ శాంతిరాజు పాల్గొన్నారు.

నెల్లూరు (విద్య): నగరంలోని డీకే ప్రభుత్వ జూనియర్ మహిళా కళాశాలలో బుధవారం గాంధీ జయంతి సందర్భంగా విద్యార్థులచే స్వచ్ఛతా హీ సేవా, స్వచ్ఛభారత్ దివాస్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులచే అవగాహన, ర్యాలీ, మొక్కలు నాటే కార్యక్రమాలను చేపట్టారు. ఈ సందర్భంగా ఆర్ఐవో, ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.శ్రీనివాసులు మాట్లాడుతూ విద్యార్థులు విరివిగా సేవా కార్యక్రమాలను చేపట్టాలని, పరిశరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారిణి జీ.కరుణ కుమారి, ప్రసన్న, భారతి, అధ్యాపకులు పాల్గొన్నారు.



డీకే కళాశాలలో మొక్క నాటుతున్న అధ్యాపకులు

పాలిథిన్ నిషేధం ఉత్తిమాటే!

నానాటికి పెరుగుతున్న వినియోగం


న్యూస్‌టుడే, నెల్లూరు(నగరపాలక సంస్థ)

పర్యావరణానికి ముప్పుగా మారిన ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించడంలో అధికారులు విఫలమవుతున్నారు. మొక్కుబడిగా తనిఖీలు నిర్వహిస్తుండటంతో వ్యాపారులు, వినియోగదారుల్లో ఎలాంటి మార్పు రావడం లేదు. నగరపాలక సంస్థ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో దుకాణాల్లో యథేచ్ఛగా పాలిథిన్ సంచులు విక్రయిస్తున్నారు. నెల్లూరు నగరంలో కిరాణదుకాణాల నుంచి తోపుడుబండ్ల వరకు వినియోగదారులకు ప్లాస్టిక్ సంచుల్లో సరకులు అందజేస్తున్నారు.

ఆరంభ శూరత్వమే

నగరంలో ఆర్నెల్ల క్రితం పాలిథిన్ వినియోగాన్ని నిషేధిస్తున్నట్లు ప్రకటించారు. నిబంధనలు పాటించని వారిపై రూ.2వేల నుంచి రూ.25వేల వరకు జరిమానా విధిస్తామని హెచ్చరించారు. వ్యాపారులు, అధికారులతో ఒక కమిటీని ఏర్పాటు చేసి హడావుడి చేశారు. వ్యాపార సముదాయాల్లో విరివిగా తనిఖీలు నిర్వహించి నిషేధిత పాలిథిన్ సంచులను పెద్దమొత్తంలో స్వాధీనం చేసుకున్నారు. ప్రజల నుంచి స్పందన వస్తున్న క్రమంలో అధికారులు తమ చర్యలను విరమించుకున్నారు. దీంతో యథావిధిగా పాలిథిన్ వినియోగం పెరిగిపోయింది. పాలిథిన్ వినియోగాన్ని పూర్తిస్థాయిలో నిషేధించేందుకు కృషి చేస్తామని కమిషనర్ సూర్యతేజ తెలిపారు.


డ్రైనేజీలో పారుదలకు అడ్డంకిగా పాలిథిన్ కవర్లు


ఇదీ పరిస్థితి

డంపింగ్‌యార్డు అంతా ప్లాస్టిక్ వ్యర్థాలే

నగరంలో పాలిథిన్ సంచుల వినియోగం నానాటికీ పెరిగిపోతోంది. రోజుకు సగటున 320 టన్నుల వ్యర్థాలు ఉత్పత్తి అయితే వీటిలో 60 టన్నుల వరకు ప్లాస్టిక్ వ్యర్థాలు ఉండటం గమనార్హం. ప్రజలు తమ అవసరం తీరాక పాలిథిన్ సంచులను డ్రెయినేజీల్లో పడేస్తున్నారు. దీంతో మురుగునీటి ప్రవాహానికి తీవ్ర ఆటంకం కలుగుతోంది. నగరంలో ఏ మురుగు కాలువను చూసినా పాలిథిన్ వ్యర్థాలే కనిపిస్తున్నాయి. క్రమం తప్పకుండా వీటిని తొలగించడం పారిశుద్ధ్య సిబ్బందికి సవాలుగా మారింది. మురుగు కాలువలు ఎక్కడికక్కడ వ్యర్థాలతో పూడిపోవడంతో వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయమవుతున్నాయి. కాలువలు పూడిపోవడంతో వరదనీరు వేగంగా బయటకు వెళ్లే మార్గం లేక రోడ్లు సైతం ముంపునకు గురవుతున్నాయి. నగరంలో ప్లాస్టిక్ వినియోగం నిషేధించినప్పటికీ అమలుకు అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. దీంతో కిరాణ, హోటళ్లు, వస్త్ర దుకాణాలు, మాంసం విక్రయ కేంద్రాల్లోనూ సంచులను విరివిగా వినియోగిస్తున్నారు. ప్లాస్టిక్ నిషేధిత చట్టం సక్రమంగా అమలు చేయాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు. ఇప్పటికైనా నగరపాలక సంస్థ అధికారులు స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.